

హనుమకొండ హంటర్‌రోడ్డులో మెడికవర్ మల్టీ నేషనల్ ఆస్పత్రిని శనివారం సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రాన్ని మెడికల్ హబ్‌గా అభివృద్ధి చేస్తామని.. అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిన హైదరాబాద్ విశ్వనగరంగా గుర్తింపు పొందిందని, ఆ మాదిరిగానే వరంగల్‌నూ రూపుదిద్దుతామన్నారు. ప్రతీ పౌరుడికి హెల్త్ ప్రొఫైల్ తయారు చేసి, యూనిక్ నెంబరుతో డిజిటల్ కార్డులు ఇచ్చి.. తద్వారా ఏ ఆస్పత్రిలోనైనా ఉచితంగా చికిత్స పొందేలా కార్యాచరణ రూపొందిస్తామన్నారు. హెల్త్, ఎడ్యుకేషన్, ఎకో, టెంపుల్ టూరిజం అన్నీ ఒక వరంగల్‌లోనే అభివృద్ధి చేసుకునే అవకాశాలున్నాయన్నారు.



నగర అభివృద్ధిపై సమీక్ష నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి

నగర సమగ్రాభివృద్ధికి మాస్టర్ ప్లాన్



సమీక్షలో మాట్లాడుతున్న సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్‌కు దీటుగా అభివృద్ధి చేస్తాం

- ఇందుకు రూ.6,115కోట్లు అవసరమని అంచనా
- రింగ్ రోడ్డు, మామునూరు విమానాశ్రయానికి భూసేకరణ చేపట్టండి
- అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీకి డీపీఆర్ సిద్ధం చేయాలి
- నిమ్స్ తరహాలో ఎంజీఎంలో ఎన్‌వోసీల అమలుకు యోచన
- నగరాభివృద్ధిపై సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- వివిధ శాఖల అధికారులకు దశ దిశా నిర్దేశం
- నిర్లక్ష్యం చేస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరిక
- వరంగల్, హనుమకొండ జిల్లాల్లో సీఎం విస్తృత పర్యటన



హనుమకొండ కలెక్టరేట్‌లో మహిళా శక్తి క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న సీఎం రేవంత్, చిత్రంలో మంత్రులు

హనుమకొండ, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ నగర సమగ్రాభివృద్ధికి మాస్టర్‌ప్లాన్ రూపొందిస్తామని, నగరాన్ని హైదరాబాద్‌కు దీటుగా మరో విశ్వనగరంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటామని, ఈ దిశగా తానే స్వయంగా ప్రత్యేక దృష్టి పెడతానని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. శనివారం వరంగల్, హనుమకొండ జిల్లాల పర్యటనకు వచ్చిన ఆయన మధ్యాహ్నం 01.10 గంటకు హెలికాప్టర్‌లో గీసుకొండ మండలంలోని కాకతీయ మెగా టెక్స్‌టైల్ ఫ్యాక్టరీకి చేరుకున్నారు. ఆ తర్వాత వరంగల్‌లో నిర్మిస్తున్న సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి పను లను పరిశీలించి.. హనుమకొండ కలెక్టరేట్‌కు చేరుకున్నారు. ఇందిరమ్మ మహిళా శక్తి క్యాంటీన్లను ప్రారంభించిన అనంతరం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వరంగల్ నగరాభివృద్ధికి సంబంధించిన ఎనిమిది అంశాలపై మూడున్నర గంటల పాటు సుదీర్ఘంగా అన్ని విభాగాల అధికారులతో సమీక్ష జరిపారు. అయితే రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత నగర సమస్యలపై ఇంత సుదీర్ఘంగా సమీక్ష జరపడం ఇదే మొదటి సారి. ఈ సందర్భంగా ఆయన రింగ్ రోడ్డు నిర్మాణం, స్మార్ట్ సిటీ పనులు, అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ, మా మునూరు విమానాశ్రయం, కాళోజీ కళాక్షేత్రం, సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రి, తదితర అంశాలపై క్షుణ్ణంగా చర్చించారు. ఈ సందర్భంగా నగరాభివృద్ధికి తీసుకోవలసిన చర్యలపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. విధుల నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారుల ను ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. నగర సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యేలు, ఎంపీలు ఎప్పుడైనా తనను కలవవచ్చునని అన్నారు. ఈ క్రమంలో హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య రింగ్ రోడ్డుపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. రెండు చోట్ల 13 కిలోమీటర్ల వరకు చేపట్టనున్న రింగ్ రోడ్డు నిర్మాణానికి తొలుత సత్వరమే భూసేకరణ చేపట్టాలని, ఆ తర్వాతే నిర్మాణ పనులను చేపట్టాలని, వరంగల్ నుంచి ఇతర జిల్లాలకు రవాణా సౌకర్యం మెరుగపడేలా జాతీయ రహదారుల అనుసంధానాన్ని పెంచేందుకు చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. భారీ వర్షాలు కురిసినప్పుడు వరంగల్‌లో కాలనీలు మునుగుతున్నాయని, ఈ సమస్య శాశ్వత పరిష్కారానికి సత్వరం చర్యలు తీసుకోవాలని అధికారులను సీఎం ఆదేశించారు. అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టాలని, నాలాల ఆక్రమ ణపై దృష్టి సారించాలని అన్నారు. నాలాల్లో ఇసుక ఎప్పటికప్పుడు తొల గించాలని.. హైదరాబాద్ నగరంలో అవలంబిస్తున్న కొత్త పద్ధతులను వరంగల్‌లోనూ ప్రయోగించాలని

మిగతా 7వ పేజీలో..





టెక్స్‌టైల్ పార్కులో కంపెనీ ఛాయాచిత్రాన్ని పరిశీలిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణంపై అధికారులతో మాట్లాడుతున్న సీఎం

భద్రకాళి ఆలయ అభివృద్ధికి సహకారం అందిస్తాం

- తగిన నివేదికలు, నిధుల వివరాలను పంపించండి
- రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ కమిషనర్ హన్మంతరావు
- అమ్మవారిని దర్శించుకొని మాడవీధుల పనుల పరిశీలన

6



అమ్మవారిని దర్శించుకున్న దేవాదాయ కమిషనర్ హన్మంతరావు

నిర్మాణాత్మక ప్రజా పోరాటాలు చేపట్టాలి

ఎంసీపీఐ (యూ) రాష్ట్ర కార్యదర్శి రవి

8

సహకార సంఘాలు ఆర్థిక మార్గాలను అన్వేషించాలి

డీసీసీ బ్యాంకు మహాజన సభలో టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు

6



మాట్లాడుతున్న మార్నేని రవీందర్‌రావు

సాంకేతికతను జోడించి నాణ్యమైన విద్యుత్‌ను అందించాలి

- వినియోగదారుల సమస్యలు పరిష్కరిస్తూ వారధిగా నిలవాలి
- ఎన్పీడీసీఎల్ ఉద్యోగులకు ట్రాన్స్‌కో సీఎండీ రోనాల్డ్ రోస్ పిలుపు

6







సహకార సంఘాలు ఆర్థిక మార్గాలను అన్వేషించాలి..

డీసీసీ బ్యాంకు మహాజన సభలో టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు



సభలో మాట్లాడుతున్న మార్నేని రవీందర్‌రావు

హనుమకొండ సిటీ, జూన్ 29: డీసీసీ బ్యాంకు ఆధ్వర్యంలోని సహకార సంఘాలు ఆర్థిక బలోపేత మార్గాలను అన్వేషించాలని తెలంగాణ రాష్ట్ర కో-ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ (టెస్కాబ్) చైర్మన్ మార్నేని రవీందర్‌రావు సూచించారు. శనివారం హనుమకొండ నక్కలగుట్టలోని డీసీసీ బ్యాంకు ప్రధాన కార్యాలయంలో రవీందర్‌రావు అధ్యక్షతన మహాజన సభ జరిగింది. సభలో బ్యాంకు లావాదేవీలు, అప్పులు, రుణాల మంజూరు, రికవరీ, భవిష్యత్తు ప్రణాళికలు, బ్యాంకు టర్నోవర్ లక్ష్యం తదితర అంశాలను ప్రస్తావించారు. మహాజన సభనుద్దేశించి మార్నేని రవీందర్‌రావు మాట్లాడుతూ.. సహకార సంఘాలు ఆర్థికంగా మరింత బలోపేతం అయితే సేవల విస్తరణ జరుగుతుందన్నారు. ఫలితంగా నూతనంగా ఏర్పర్చుకున్న ప్రగతి లక్ష్యాల సాధన జరుగుతుందన్నారు. సహకార సంఘాల పరిధిలోని రైతుల అవసరాలే కాకుండా ఆయా ప్రాంతాల్లోని ప్రజల అవసరాలను గుర్తించి ఆ మేరకు వ్యాపారాలు నిర్వహిస్తే ఆర్థిక ఫలితాలుంటాయన్నారు. ఎప్పటికప్పుడు ఆర్థికంగా జరుగుతున్న మార్పులను పరిశీలించుకొని ఆ మేరకు ఆయా ప్రాంతాల ప్రజల అవసరాలను పరిగణనలోకి తీసుకొని సంఘాలు వ్యాపారాల నిర్వహణను విస్తరించుకోవాలని సూచించారు. సంఘాలు వ్యాపార నిర్వహణపై దృష్టి పెడితే అనేక మార్గాల్లో ఫలితాలను సాధించవచ్చన్నారు. విత్తనాలు, ఎరువుల విక్రయాలే కాకుండా గ్యాస్ ఏజెన్సీలు, మాల్స్ నిర్వహణ, జెనరిక్ మెడికల్ షాప్స్, పెట్రోలు పంపులు, ఫంక్షన్ హాల్స్ ఇలా ఎన్నో వ్యాపారానికి అనువుగా ఉంటాయన్నారు. వీటిని పరిశీలించి అధ్యయనం చేసి ప్రారంభిస్తే తప్పక ఫలితాలు ఉంటాయన్నారు. తద్వారా సహకార సంఘాలు ఆర్థికంగా బలోపేతం అవుతాయన్నారు.

డీసీసీ బ్యాంకు టర్నోవర్ రూ.2200 కోట్ల లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు మార్నేని రవీందర్‌రావు వెల్లడించారు. ప్రస్తుతం రూ.1930 టర్నోవర్‌ను సాధించినట్లు చెప్పారు. కమర్షియల్ బ్యాంకులతో పాటు రుణాల మంజూరులో బ్యాంకు పోటీ పడుతుందన్నారు. అన్ని వర్గాల వారికి రుణాలు అందిస్తున్నట్లు చెప్పారు. ప్రగతి సాధనలో భాగంగా 50 సహకార సంఘాలు ఆర్థికంగా వృద్ధి సాధించాయని, ఇంత సంఖ్యలో సంఘాలు బలపడడం ఉమ్మడి వరంగల్ జిల్లాలోనే జరిగిందన్నారు. సి-గ్రేడ్‌లో ఉన్న సంఘాలు బి నుంచి ఏ, ఏ-1 స్థాయికి చేరాయని వివరించారు. అయితే ప్రస్తుతం సి-గ్రేడ్‌లో ఉన్న సంఘాలు కూడా తమ ఉన్నతిని పెంచుకొని పోటీతత్వాన్ని ప్రదర్శించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రైతులకు ఏకకాలంలో రూ.2లక్షల రుణమాఫీ ద్వారా ఉమ్మడి వరంగల్ జిల్లాలో డీసీసీ బ్యాంకు ద్వారా 78,432మంది రైతులకు లబ్ధి చేకూరనున్నట్లు రవీందర్‌రావు వెల్లడించారు. రుణమాఫీ ద్వారా ఉమ్మడి వరంగల్‌లో మొత్తంగా రూ.522కోట్ల రుణాలు మాఫీ కానున్నట్లు చెప్పారు. బ్యాంకు అధికారుల సమర్పించిన రైతుల రుణమాఫీ వివరాలను ప్రభుత్వానికి ఇప్పటికే ప్రతిపాదించినట్లు చెప్పారు. ఇందులో లోపాలు తలెత్తితే అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని రవీందర్‌రావు స్పష్టం చేశారు.

అనంతరం బ్యాంకు ప్రగతి నివేదికను రవీందర్‌రావు ఆవిష్కరించారు. ఈ సమావేశంలో డీసీసీ బ్యాంకు వైస్ చైర్మన్ కుందూరు వెంకటేశ్వరరెడ్డి, డైరెక్టర్లు కంది శ్రీనివాస్‌రెడ్డి, ఉపేందర్‌రెడ్డి, హరిప్రసాద్, మురళీధర్, రాజేశ్వర్‌రెడ్డి, రమేశ్, రంజిత్, గోపాలరావు, శ్రీనివాస్, రవిరాజా, నరేందర్, ప్రదీప్‌చందర్, డీసీసీ బ్యాంకు సీఈవో వాజిర్ సుల్తాన్, డీసీవోలు తదితరులు పాల్గొన్నారు.







భద్రకాళి ఆలయ అభివృద్ధికి సహకారం అందిస్తాం..

రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ కమిషనర్ హన్మంతరావు



మాడవీధుల ప్లాన్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ హన్మంతరావు

వరంగల్ కల్చరల్, జూన్ 29: చారిత్రక ప్రసిద్ధిగాంచిన భద్రకాళి ఆలయ అభివృద్ధి, మాడవీధుల నిర్మాణ పనులకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ కమిషనర్ మంత్రి ప్రగడ హన్మంతరావు అన్నారు. శనివారం వరంగల్‌లోని భద్రకాళి అమ్మవారి ఆలయాన్ని సందర్శించారు. ముందుగా కమిషనర్‌కు ఆలయ అర్చకులు, ఈవో శేషు భారతి, ప్రధానార్చకుడు భద్రకాళి శేషు మంగళ వాయిద్యాలతో ఘనంగా స్వాగతం పలికారు. కమిషనర్ గోశాలను సందర్శించి ఆదిశంకరాచార్యులు, వల్లభ గణపతిని దర్శించుకున్న అనంతరం భద్రకాళి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ మహా మండపంలో కమిషనర్ హన్మంతరావుకు ప్రధానార్చకుల ఆధ్వర్యంలో వేదపండితులు ఆశీర్వచనం చేసి అమ్మవారి శేష వస్త్రాలను బహూకరించి ప్రసాదాలు అందజేశారు.

అనంతరం రూ.30కోట్లతో భద్రకాళి ఆలయ అభివృద్ధి మాడవీధుల నిర్మాణ పనులపై ఆయన అర్చకులతో చర్చించారు. మాడవీధుల పనులు ప్రారంభం కాగా, భద్రకాళి ఆలయాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు ప్రణాళిక రూపొందించామని దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్‌రావు వివరించారు. ఆలయ అభివృద్ధి కోసం రూపొందించిన మాస్టర్ ప్లాన్‌ను కమిషనర్ హన్మంతరావు పరిశీలించారు. ప్లాన్ ప్రకారం పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇంకా ఆలయ అభివృద్ధికి అవసరమైన పనులు, నిధుల వివరాలతో నివేదిక సిద్ధం చేసి పంపిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. మాడవీధుల పనులను కమిషనర్ పరిశీలించారు. అన్నదాన సత్రం, వేద పాఠశాల భవనాలు, ఆలయానికి సంబంధించిన ఇతర నిర్మాణ పనుల వివరాలు కమిషనర్ అడిగి తెలుసుకున్నారు. నాణ్యతలో ఎటువంటి రాజీలేకుండా పనులు చేపట్టాలని, మాస్టర్ ప్లాన్ ఆధారంగా పనులు పూర్తయ్యేలా ఆలయ అభివృద్ధికి ప్రత్యేక చొరవ చూపాలని కమిషనర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జోన్ డిప్యూటీ కమిషనర్ టి.శ్రీకాంత్‌రావు, సహాయ కమిషనర్ రాయల సునిత, మేడారం ఈవో రాజేంద్రం, ఇన్‌స్పెక్టర్లు సంజీవరెడ్డి, అనిల్, ఐఎన్‌పీఆర్ రీజినల్ జాయింట్ డైరెక్టర్ జగన్, రీజినల్ ఇన్ఫర్మేషన్ ఇంజనీర్ శ్రీరాములు, డీపీఆర్‌వో కిరణ్మయి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సాంకేతికతను జోడించి నాణ్యమైన విద్యుత్‌ను అందించాలి

ఎన్పీడీసీఎల్ ఉద్యోగులకు ట్రాన్స్‌కో సీఎండీ రోనాల్డ్ రోస్ పిలుపు



సమావేశంలో మాట్లాడుతున్న ట్రాన్స్ కో సీఎండీ రోనాల్డ్ రోస్

హనుమకొండ టౌన్, జూన్29: కొత్తగా వస్తున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని ఎన్పీడీసీఎల్ ఉద్యోగులకు ట్రాన్స్‌కో సీఎండీ రోనాల్డ్‌రోస్ పిలుపునిచ్చారు. శనివారం నక్కలగుట్టలోని విద్యుత్ భవన్‌లో డైరెక్టర్లు, సీజీఎంలు, జీఎంలతో సీఎండీ రోనాల్డ్‌రోస్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ ఒక్క ఉద్యోగి నైపుణ్యత, సామర్థ్యం పెంచుకోవాలని సూచించారు. వినియోగదారులకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరిస్తూ వారధిలా నిలవాలన్నారు. నిబద్ధతతో పనిచేసి అనుకున్న లక్ష్యాలను చేరుకోవాలన్నారు.

ఈ సందర్భంగా టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి డిస్కం గురించి రోనాల్డ్‌రోస్‌కు పూర్తిగా వివరించారు. కంపెనీ పరిధిలోని 16 సర్కిళ్ల పరిధిలో 67 లక్షల వినియోగదారులకు మెరుగైన సరఫరా అందిస్తున్నామని తెలిపారు. ఆపరేషనల్ స్ట్రక్చర్ గురించి ప్రస్తావిస్తూ ఇన్ ఫ్రాస్ట్రక్చర్, డిస్ట్రిబ్యూషన్, సంస్థ మానవ వనరులు, సబ్‌స్టేషన్స్ స్కాడా గురించి వివరించారు. సంస్థను బలోపేతం చేయడంలో భాగంగా కొత్త సబ్‌స్టేషన్‌ల నిర్మాణం, 33కేవీ ప్రత్యామ్నాయ సరఫరా, పాత సబ్‌స్టేషన్‌ల పునరుద్ధరణ పనులను చేపడుతున్నట్లు వెల్లడించారు. వినియోగదారులకు మరింత చేరువయ్యేలా ప్రతి సోమవారం సెక్షన్‌ల నుంచి సర్కిల్ కార్యాలయాల వరకు విద్యుత్ ప్రజావాణి నిర్వహిస్తున్నామన్నారు. విద్యుత్ బిల్లులపై క్యూఆర్ కోడ్ ముద్రించి అందిస్తున్నట్లు తెలిపారు. కొత్త టెక్నాలజీని అందిపుచ్చుకొని సబ్‌స్టేషన్ ఆటోమేషన్ చేపడుతున్నామన్నారు. అనంతరం సీఎండీ రోనాల్డ్ రోస్‌ను ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి మెమొంటోతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి డైరెక్టర్లు అశోక్‌కుమార్, సదర్‌లాల్, మోహన్‌రావు, తిరుపతిరెడ్డి, సిజియంలు తిరుమల్‌రావు, మధుసూదన్, కిషన్, రాజుచౌహాన్, కె.ఎస్.గుప్త, రవీంద్రనాథ్, ట్రాన్స్ కో సీఈ పుల్లయ్య, రాంకుమార్, తదితరులు పాల్గొన్నారు.

టెక్స్‌టైల్ పార్కు భూ నిర్వాసితులకు ఇందిరమ్మ ఇళ్లు

అధికారులకు ఆదేశాలిచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి



టెక్స్‌టైల్ పార్కులో ఫొటో ఎగ్జిబిషన్‌ను పరిశీలిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

గీసుగొండ, జూన్ 29 : కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు కోసం భూములిచ్చిన నిర్వాసితులకు వంద గజాల స్థలంలో అన్ని వసతులతో కూడిన ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. గీసుగొండ మండలంలోని కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కును శనివారం సీఎం రేవంత్‌రెడ్డి 50 నిమిషాల పాటు పరిశీలించారు. హైదరాబాద్ నుంచి హెలికాప్టర్‌లో వచ్చిన సీఎం టెక్స్‌టైల్ పార్కులోని యంగ్వాన్ కంపెనీ సమీపంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు మధ్యాహ్నం 01.10 గంటకు చేరుకున్న ఆయన అక్కడి నుంచి బస్సులో కిలోమీటరు దూరంలో ఉన్న కైటెక్స్ కంపెనీ వద్ద ఏర్పాటు చేసిన వనమహోత్సవ కార్యక్రమానికి 01.25 గంటలకు చేరుకున్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం టెక్స్‌టైల్ పార్క్‌లో ఏర్పాటుచేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను పరిశీలించారు. పార్కు స్థలం మ్యాప్‌తోపాటు ఏర్పాటవుతున్న కంపెనీల వివరాలు, ఉత్పత్తుల గురించి స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేష్‌రంజన్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సీఎంకు వివరించారు. ఈ క్రమంలో గతేడాది భారీ వర్షాల వల్ల పార్కు స్థలంలో 300 ఎకరాలు ముంపునకు గురై కైటెక్స్ కంపెనీ నిర్మాణ పనులు నిలిచి పోయాయని, అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ ఏర్పాటు చేయాలని కంపెనీ ప్రతినిధి మనోజ్ కుమార్ సీఎం దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన సీఎం వరద ముంపును నివారించేందుకు 10 ఎకరాల్లో పాండ్‌ను నిర్మించి అందులోని నీటిని పరిశ్రమలకు ఉపయోగించుకునే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. వర్షాకాలంలో పాండ్‌లో ఎక్కువైన నీటిని కాలువ ద్వారా సమీప చెరువులోకి పంపించేలా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని టీజీఐఐసీ అధికారులను ఆదేశించారు. అదేవిధంగా భూ నిర్వాసితులకు నీటి సరఫరా, రోడ్లు, విద్యుత్, డ్రెయినేజీ వంటి మౌలిక వసతులతో వంద గజాల ప్లాట్లు ఇచ్చి ఇందిరమ్మ ఇళ్ల సబ్సిడీని కూడా అందించాలని కలెక్టర్‌కు సీఎం సూచించారు. అలా భూ నిర్వాసితులకు నిర్మించే కాలనీని మేజర్ గ్రామపంచాయతీగా గుర్తించి అన్ని వసతులను కల్పించాలన్నారు. భూ నిర్వాసితులకు ఇప్పటి వరకు 1200 ప్లాట్లు ఏర్పాటు చేశామని.. ఇంకా 150 మందికి ఇవ్వాల్సిన ప్లాట్లను ఫైలాన్ వద్ద సిద్ధం చేస్తున్నట్లు టీజీఐఐసీ అధికారులు సీఎంకు వివరించారు. అనంతరం 2గంటలకు ఎగ్జిబిషన్ హాల్ నుంచి బయటకు వచ్చిన సీఎంను కలిసేందుకు కాంగ్రెస్ నాయకులు పోటీపడ్డారు.

ఈ కార్యక్రమంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, దామోదర రాజనర్సింహ, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, కేఆర్ నాగరాజు, ఎంపీ కడియం కావ్య, సీఎస్ శాంతికుమారి, డీజీపీ రవిగుప్తా, పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్‌రంజన్, ఇంధన శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, ట్రాన్స్‌కో సీఎండీ రోనాల్డ్‌రాస్, ప్రిన్సిపల్ సెక్రటరీ హనుమంతు, సీఎంవో స్పెషల్ సెక్రటరీ అజిత్, ఎన్‌పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి, వరంగల్ కలెక్టర్ సత్యశారదాదేవి, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, టీజీఐఐసీ జోనల్ మేనేజర్ సంతోష్‌కుమార్, ఎంపీపీలు భీమగాని సౌజన్య, కళావతి, సంగెం జడ్పీటీసీ గూడ సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు.



మొక్కనాటుతున్న రేవంత్

మెడికవర్ ఆస్పత్రిని ప్రారంభించిన సీఎం



సీఎంకు జ్ఞాపికను అందిస్తున్న మెడికవర్ ఆల్ ఇండియా చైర్మన్, డైరెక్టర్ అనిల్‌కృష్ణ

బాలసముద్రం, జూన్ 29: వరంగల్ నగరంలో అత్యాధునిక వసతులతో ప్రజలకు వైద్య సేవలు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు హంటర్‌రోడ్డులో ఏర్పాటు చేసిన మెడికవర్ సూపర్ మల్టీ స్పెషాలిటీ 300 పడకల ఆస్పత్రిని సీఎం రేవంత్‌రెడ్డి శనివారం ప్రారంభించారు. ప్రపంచవ్యాప్తంగా 12 దేశాలలో కార్యకలాపాలు నిర్వహిస్తూ అత్యంత హెల్త్ కేర్ బ్రాండ్‌గా గుర్తింపుపొందిన మెడికవర్ ఆస్పత్రి 24వ బ్రాంచ్‌ను వరంగల్‌లో ఏర్పాటు చేయడంపై సీఎం రేవంత్‌రెడ్డి నిర్వాహకులను అభినందించారు. సువిశాలమైన భవనంలో అత్యాధునిక హంగులతో ఏర్పాటు చేసిన ఆస్పత్రిలో వైద్య పరికరాలను సీఎం పరిశీలించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డిని, మంత్రులను మెడికవర్ ఆల్ ఇండియా చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ అనిల్‌కృష్ణ, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు శరత్‌రెడ్డి, హరికృష్ణలు శాలువాలతో సన్మానించి జ్ఞాపికలను అందజేశారు.

ఈ సందర్భంగా డాక్టర్ అనిల్‌కృష్ణ మాట్లాడుతూ.. దేశంలో అగ్రగామి మల్టీనేషనల్ ఆస్పత్రి చైన్‌గా 24 ఆస్పత్రులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 2015లో నలుగురితో ప్రారంభించిన మెడికవర్ ఆస్పత్రి.. లక్షల మందికి వైద్య సేవలందించిందన్నారు. కరోనా సమయంలో లక్షలాది మందికి ఉచితంగా వ్యాక్సినేషన్ అందించినట్లు తెలిపారు. రాష్ట్రప్రభుత్వం మెడికవర్ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. హెల్త్ హబ్‌గా తీర్చి దిద్దేందుకు మెడికవర్ కలిసి పనిచేస్తుందని అన్నారు. వరంగల్‌లో 300 పడకలతో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో 7 ఆపరేషన్ థియేటర్స్‌తో పాటు ఎక్కువ సంఖ్యలో ఐసీయూ బెడ్స్, ప్రపంచ స్థాయి వైద్య సదుపాయాలు నగర ప్రజలకు అందించనున్నట్లు తెలిపారు. వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ.. వరంగల్ నగరం విశ్వనగరంగా అభివృద్ధి చెందుతుందన్నారు. మెడికవర్ హాస్పిటల్ వరంగల్ నగరంలో ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ధనసరి అనసూయ (సీతక్క), కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, రాష్ట్ర ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, వరంగల్ ఎంపీ కడియం కావ్య, మేయర్ గుండు సుధారాణి, ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాష్‌రెడ్డి, గండ్ర సత్యనారాయణరావు, కేఆర్.నాగరాజు, నాయిని రాజేందర్‌రెడ్డి, కడియం శ్రీహరి, తదితరులు పాల్గొన్నారు.



క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను ప్రారంభించిన సీఎం

హనుమకొండ కలెక్టరేట్, జూన్29: మహిళా సంఘాల సభ్యులు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా ఇందిర మహిళా శక్తి క్యాంటీన్ల ఏర్పాటుకు ఇటీవల శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మెప్మా ఆధ్వర్యంలో హనుమకొండ కలెక్టరేట్‌లో మహిళా సంఘం ఆధ్వర్యంలో హనుమకొండ కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఇందిర మహిళా శక్తి క్యాంటీన్‌ను శనివారం సీఎం రేవంత్‌రెడ్డి రిబ్బన్ కట్‌చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మహిళా సంఘం సభ్యులు సొంతంగా తయారుచేసిన పిండి వంటలను సీఎం రుచి చూసి అభినందించారు. మహిళా సం ఘాలు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు ప్రభుత్వం నుంచి అన్ని విధాలా సహాయ సహకారాలు అందజేస్తామని వారికి హామీ ఇచ్చారు. సీఎం వెంట మంత్రులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, దామోదర రాజనరసింహ, కొండా సురేఖ, సీతక్క, సీఎస్ శాంతికుమారి, హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు ప్రావీణ్య, సత్యశారదాదేవి, ఎమ్మెల్యేలు ఉన్నారు.

కుట్టుమిషన్ స్టాల్‌ను సందర్శించిన సీఎం

డీఆర్‌డీఓ ఆధ్వర్యంలో మహిళా శక్తి పథకం కింద మహి ళా సంఘాలకు కుట్టుమిషన్లు ఇచ్చారు. ఈ మహిళా సంఘా ల సభ్యులు శనివారం కలెక్టరేట్‌లో స్టాల్ ఏర్పాటు చేయగా సీఎం రేవంత్ రెడ్డి స్టాల్‌ను సందర్శించి మహిళలతో మాట్లా డారు. యూనిఫాంలు కుట్టడంలో ఏమైనా ఇబ్బందులు ఎదు రయ్యాయా? మీరు ఎంతమందికి యూనిఫామ్స్ కుట్టారు? ఎలా అనిపించింది? దీనివల్ల లాభం ఉందా? ఆర్థికంగా నిల దొక్కుకున్నారా? ఎవరెవరు ఎన్ని కుట్టారు? అని సభ్యులతో సీఎం మాట్లాడారు. హనుమకొండ, వరంగల్ జిల్లాల డీఆర్‌డీఓలు నాగ పద్మజ, కౌసల్యదేవి డీపీఎంలు జె.ప్రకాశ్, ఎం.అనిల్, ఎ.శ్రీకాంత్ కార్యక్రమంలో ఉన్నారు.



కుట్టుమిషన్ కేంద్రంలో మహిళలతో ముచ్చటిస్తూ..

సీఎం పర్యటన సాగిందిలా..

హనుమకొండ కలెక్టరేట్, జూన్ 29: వరంగల్ మహానగరపాలక సంస్థ అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష చేయడానికి శనివారం సీఎం రేవంత్‌రెడ్డి వరంగల్, హనుమకొండ జిల్లాల్లో పర్యటించారు. సీఎం రేవంత్‌రెడ్డి మధ్యాహ్నం 1:16నిమిషాలకు వరంగల్ జిల్లా సంగెం మండలంలోని టెక్స్‌టైల్‌పార్కుకు చేరుకున్నారు. అక్కడ వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. అనంతరం అక్కడి నుంచి 2:02 నిమిషాల కు బయలుదేరి 2:37 నిమిషాలకు వరంగల్‌లోని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి చేరుకున్నారు. అక్కడ ఆస్పత్రిని పరిశీలించి 2:52 నిమిషాలకు అక్కడి నుంచి బయలుదేరి 3:04 నిమిషాలకు హనుమకొండలోని కలె క్టరేట్‌కు చేరుకున్నారు. అక్కడ కార్యక్రమాలు ముగించుకుని సాయంత్రం 6:18 నిమిషాలకు బయలుదేరి హంటర్‌రోడ్‌లోని మెడికవర్ ఆస్పత్రికి 6:24నిమిషాలకు చేరుకున్నారు. అనంతరం అక్కడ ఆస్పత్రిని ప్రారంభిం చారు. అక్కడ ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడి సీఎం రేవంత్‌రెడ్డి తిరిగి అక్కడి నుండి 7:12 నిమిషాలకు వెళ్లిపోయారు.

అంచనా వ్యయం పెంపుపై సీఎం ఆగ్రహం

సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణ పరిశీలించిన సీఎం



సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ప్లాన్‌ను పరిశీలిస్తున్న రేవంత్‌రెడ్డి

వరంగల్ మెడికల్, జూన్ 29: వరంగల్‌లో నిర్మిస్తున్న సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణ అంచనా వ్యయం పెంపుపై సీఎం రేవంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం మధ్యాహ్నం వరంగల్‌లో నిర్మిస్తున్న సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి పనులను పరిశీలించిన ఆయన అధికారులతో మాట్లాడుతూ.. సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణం విషయంలో రూ.1100కోట్లున్న అంచనా వ్యయాన్ని ఎలాంటి అనుమతులు లేకుండా రూ.1,726 కోట్లకు ఇష్టారాజ్యంగా ఎలా పెంచారని, కేవలం మౌఖిక ఆదేశాలతో రూ.626కోట్ల వ్యయం ఎలా పెంచుతారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆస్పత్రి నిర్మాణ వ్యయంపై పూర్తిస్థాయి ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. నిర్ణీత గడువులోగా యుద్ధప్రాతిపదికన హాస్పిటల్ నిర్మాణం పూర్తి చేయాల్సిందే నని నిర్మాణ సంస్థకు సీఎం తేల్చిచెప్పారు. ఆస్పత్రి అంతస్తుల వివరాలను రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ కార్యదర్శి క్రిస్టినా జడ్ చోంగ్తూ సీఎంకు వివరించారు. ఒకటి నుంచి 15 అంతస్తులు చికిత్స కోసమని, ఇందులో మూడు, నాలుగు ఫ్లోర్లు థియేటర్లు ఉంటాయని వివరించారు. అదే విధంగా 12, 13 ఫ్లోర్లలో లేబరోటరీలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. 16, 17, 18 ఫ్లోర్లలో అకడమిక్ కార్యక్రమాలు కొనసాగుతాయని, 20, 21 ఫ్లోర్లలో సీనియర్ రెసిడెంట్లు ఉంటారని, 23వ ఫ్లోర్‌లో పరిపాలన భవనం ఉంటుందని సీఎం రేవంత్‌రెడ్డికి వివరించారు. నేషనల్ మెడికల్ కౌన్సిల్ నిబంధనలకు లోబడి నిర్మాణం జరుగుతుందని, కాకతీయ వైద్య కళాశాల సూపర్ స్పెషాలిటీలో ప్రస్తుతం తొమ్మిది విభాగాల్లో ఐదు విభాగాలు కొత్త బ్లాక్‌లోకి వస్తాయని సీఎంకు తెలిపారు. సీఎం అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ నూతన ఆస్పత్రిలో సర్జికల్ గ్యాస్ట్రో, మెడికల్ జెనెటిక్స్, జీడియాట్రిక్స్, రుమటాలజీ, సర్జికల్ ఆంకాలజీ లాంటి ఎనిమిది కొత్త విభాగాలను కూడా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ఉన్న ఎంజీఎం ఆస్పత్రిలో పీడియాట్రిక్ విభాగంతో పాటు మాతాశిశు సంరక్షణ విభాగం కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, పర్యావరణ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ, రెవెన్యూ శాఖ మంత్రి పి.శ్రీనివాస్ రెడ్డి, రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, నగర మేయర్ గుండు సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

నగర సమగ్రాభివృద్ధికి.. మాస్టర్ ప్లాన్..



సమీక్షకు హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారులు

(5వ పేజీ తరువాయి)

సూచించారు. నాలాలపై అక్రమ నిర్మాణాలు ఉంటే వెంటనే తొలగించాలని ఆదేశించారు. అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణంపై డిటేల్డ్ ప్రాజెక్టు రిపోర్టు తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. వర్షం కురిసినప్పుడు ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూడాలని అన్నారు. సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణ పనుల అంచనాల వ్యయం ఎందుకు పెరిగిందని అధికారులను ప్రశ్నించారు. ఈపీసీ పద్ధతిన పనులు చేపడుతున్నందు వల్ల ఇలా పెంచే వీలు లేదని, దీనికి ఎవరు బాధ్యత వహిస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పనుల విలువ పెంపు అంచనాల పెంపుపై ప్రత్యేక నివేదిక తయారు చేయాలని ఆదేశించారు.

సమగ్ర వివరాలతో మాస్టర్‌ప్లాన్ రూపొందించాలి

2050 సంవత్సరం వరకు వరంగల్ అభివృద్ధికి సరిపడేలా సమగ్రమైన వివరాలతో మాస్టర్ ప్లాన్ రూపొందించాలని సీఎం రేవంత్ అధికారులకు సూచించారు. వరంగల్‌లో హైదరాబాద్‌లో ఉన్న నిలోఫర్ ఆస్పత్రి తరహాలో అన్ని హంగులతో ఓ ఆస్పత్రి ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. మామునూరు ఏయిర్ పోర్టు నిర్మాణానికి అవసరమైన భూ సేకరణ వెంటనే చేపట్టాలని, ఇందుకు అవసరమైన నిధులు కేంద్ర ప్రభుత్వం సమకూరుస్తుందో లేదో తెలుసుకోవాలన్నారు. అలాగే సెప్టెంబర్ 9 నాటికి కాళోజీ కళాక్షేత్రం నిర్మాణం పనులు పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేయాలని, ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దని అధికారులను హెచ్చరించారు. అత్యవసర సమయాల్లో ఆపరేషన్లు, ఇతర వైద్య సేవలకు నిమ్స్‌లో అందిస్తున్నట్లుగా ఎంజీఎం ఆస్పత్రిలో ఎన్‌వోసీ ఇచ్చే అంశంపై పరిశీలన జరుపుతామన్నారు. ఎమర్జెన్సీ సమయంలో సర్జరీలు, వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్లు, సిబ్బందికి తగిన పారితోషికం అందిస్తామని, స్వశక్తి మహిళా సంఘాలను మరింత బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని రేవంత్ పేర్కొన్నారు. స్కూల్ విద్యార్థుల యూనిఫారంకు సంబంధించిన పెండింగ్ బిల్స్ ఉంటే వెంటనే చెల్లించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించారు. రాబోయే రోజుల్లో అన్ని ప్రభుత్వ శాఖల యూనిఫామ్‌లు కుట్టించే బాధ్యతను మహిళా సంఘాలకు అప్పగించే అవకాశం ఉందని, ఈ విషయాన్ని చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. త్వరలో వరంగల్ అభివృద్ధిపై జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి విస్తృత స్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు రేవంత్ రెడ్డి తెలిపారు. ఇందుకోసం అన్ని వివరాలతో కూడిన ఒక ప్రణాళికను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. వరంగల్ నగర అభివృద్ధికి రూ.6,115 కోట్ల నిధులు అవసరమని ప్రాథమికంగా గుర్తించామని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.ప్రజలు తమపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయబోమని, సుపరిపాలన అందించితీరుతామని ముఖ్యమంత్రి అన్నారు. వరంగల్ నగరాభివృద్ధికి అడిగినన్ని నిధులు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. వారసత్వ పరంగా వరంగల్ నగరానికి గొప్పపేరుందని గుర్తు చేశారు. సమర్థత ఆధారంగానే బదిలీలు నిర్వహిస్తామన్నారు. రాజకీయ ప్రేరేపిత బదిలీలు ఉండబోవని స్పష్టం చేశారు. అధికారులు భయపడాల్సి అవసరం లేదని, ఎవరి పనివారు చేసుకుంటూ ముందుకు సాగాలని హితవు పలికారు. ప్రస్తుతం తాను సమీక్షను ప్రాథమికంగానే నిర్వహించానని, 45 రోజుల తర్వాత వచ్చి పూర్తి స్థాయిలో మరో సారి సమీక్ష సమావేశం నిర్వహిస్తానని చెప్పారు.

రింగ్‌రోడ్డు భూసేకరణ వేగవంతానికి చర్యలు : పొంగులేటి

రింగ్ రోడ్డు భూసేకరణ వేగవంతానికి చర్యలు తీసుకుంటామని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రి అంచనా వ్యయం పెరగడంపై లోతుగా పరిశీలించి నిర్ణయం తీసుకుంటామన్నారు. ఈ ఆస్పత్రి ద్వారా వెంటనే వైద్యసేవల అందుబాటులో వచ్చేలా చూస్తామన్నారు. రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ మట్లాడుతూ.. కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ (కుడా) రూపొందించిన మాస్టర్ ప్లాన్ సరిగా లేదని, మళ్లీ కొత్త మాస్టర్ ప్లాన్‌ను రూపొందించాల్సిన అవసరం ఉందని అన్నారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ.. నగరంలోని కొన్ని చోట్ల ప్రభుత్వ స్థలాలు కబ్జాకు గురయ్యాయని, సీఎం దృష్టికి తీసుకువచ్చారు. వీటిని తిరిగి స్వాధీనం చేసుకోవాలని కోరారు. నగరంలో పేరుకుపోయిన సమస్యలను సీఎం దృష్టికి తీసుకువచ్చారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ.. వరంగల్ సమగ్రాభివృద్ధిని నిరంతరం పర్యవేక్షించడానికి ఒక స్పెషల్ ఆఫీసర్‌ను నియమించాలని సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో పలు అంశాలను సీఎం దృష్టికి తీసుకువచ్చారు. రింగ్ రోడ్డు నిర్మాణంతో పాటు జాతీయ రహదారుల అనుసంధానం సాధ్యాసాధ్యాల గురించి వివరించారు.

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతకుమారి మాట్లాడుతూ వరంగల్ నగర అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనలు పాటిస్తామన్నారు. సమీక్ష సమావేశంలో చర్చకు వచ్చిన ప్రతీ అంశాన్ని చిత్తశుద్ధితో అమలు చేస్తామన్నారు. వరంగల్ నగరంలో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణానికి సత్వరమే చర్యలు తీసుకుంటామని, మామునూరు ఏయిర్ పోర్టు నిర్మాణానికి భూసేకరణ పనులను త్వరలో చేపడతామని చెప్పారు. అనంతరం స్వశక్తి మహిళలకు రూ. 518.71 కోట్ల చెక్కును ముఖ్యమంత్రి అందజేశారు. ఈ సమీక్షా సమావేశంలో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క), వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా, రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి, రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు రామచంద్రునాయక్, సీఎం సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డి, నగర మేయర్ గుండు సుధారాణి, ఎంపీలు కడియం కావ్య, పోరిక బలరాం నాయక్, ఎమ్మెల్సీలు బస్వరాజు సారయ్య, బండా ప్రకాశ్, ఉమ్మడిజిల్లా ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, నాయిని రాజేందర్ రెడ్డి, రేవూరి ప్రకాశ్ రెడ్డి, కెఆర్ నాగరాజు, గండ్ర సత్యనారాయణ, యశస్వినిరెడ్డి , తెలంగాణ స్టేట్ ఫైనాన్స్ కమిషన్ చైర్మెన్ సిరిసిల్ల రాజయ్యతో పాటు వరంగల్, హనుమకొండ కలెక్టర్లు సత్యశారదాదేవి, ప్రావీణ్య, వివిధ ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణలో విద్యార్థులు ముందుండాలి

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 29: పర్యావరణ పరిరక్షణలో విద్యార్థులు ముందుండాలని జిల్లా సైన్స్ అధికారి, ఎన్‌జీసీ జిల్లా కన్వీనర్ ఎస్.శ్రీనివాస్ స్వామి అన్నారు. హనుమకొండలోని ప్రభుత్వ ప్రాక్టీసింగ్ పాఠశాలలో ఎన్‌జీసీ ఆధ్వర్యంలో విద్యార్థులు పర్యావరణ పరిరక్షణ అంశంపై పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస స్వామి మాట్లాడుతూ.. విచక్షణారహిత మానవ కార్యాకలాపాల కారణంగా వాతావరణం, నీరుతో పాటు భూమి కలుషితమవుతూ ఎడారిలా మారి కరువు కోరల్లో చిక్కుకుంటున్నామన్నారు. విద్యార్థులు తమ ఆవాస ప్రాంతంలోని వారికీ పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించాలన్నారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి హెడ్మాస్టర్ వి.జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.



బాలకుమార్ దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

సమాజంలో గురువుల బాధ్యత గొప్పది

రీజినల్ జాయింట్ డైరెక్టర్ సత్యనారాయణరెడ్డి

గీసుగొండ, జూన్ 29: విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దే గురువుల బాధ్యత సమాజంలో ఎంతో గొప్పదని విద్యాశాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ సత్యనారాయణరెడ్డి అన్నారు. మండలంలోని ఎలుకుర్తిలో జడ్పీ పాఠశాల గెజిటెడ్ హెచ్‌ఎం మండల బాలకుమార్ పదవీ విరమణ సన్మాన సభ శనివారం నిర్వహించారు. బాలకుమార్ దంపతులను ఘనంగా న్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా వ్యవస్థలో బాలకుమార్ నిబద్ధతతో పనిచేసి ఉపాధ్యాయులకు ఆదర్శంగా నిలిచారన్నారు. కార్యక్రమంలో ఎంఈవో చదువుల సత్యనారాయణ, మండల నోడల్ అధికారులు రవిందర్, సుజన్‌తేజ, హెచ్‌ఎంలు రజాక్, పట్టాభి, సాంబయ్య, అనిత, జ్యోతిర్మయి, ఉపాధ్యాయ సంఘాల నేతలు, ఉపాధ్యాయులు, సీఆర్పీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

కోటను సందర్శించిన శ్రీలంకవాసులు



ఖిలావరంగల్ కోటలో శిల్పాలను తిలకిస్తున్న ట్రైనీ జర్నలిస్టులు

ఖిలావరంగల్, జూన్ 29: చారిత్రక ప్రసిద్ధి చెందిన కాకతీయుల కాలంనాటి దేవాలయాలు, కట్టడాలు, శిల్పసంపదను హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల శిక్షణ కేంద్రంలో శిక్షణ పొందుతున్న శ్రీలంకకు చెందిన 29 మంది ట్రైనీ జర్నలిస్టులు సందర్శించారు. శనివారం ఖిలావరంగల్ మధ్యకోటలోని శిల్పాలను శిక్షణలో భాగంగా ట్రైనీ జర్నలిస్టులు తిలకించారు. కీర్తితోరణాలు, ఖుష్ మహల్, ఏకశిలగుట్ట, సింగారపు బావి, స్వయంభూ దేవాలయం, రాతి, మట్టి కోటలను వారు ఆసక్తిగా తిలకించారు. తెలంగాణ రాష్ట్ర పర్యాటక శాఖ అధికారి కుసుమ సూర్యకిరణ్ కాకతీయుల చరిత్ర, విశేషాలను వారికి తెలిపారు. వారు తమ వెంట తెచ్చుకున్న కెమెరా, సెల్‌ఫోన్లలో కోటలోని కాకతీయుల అద్భుత, కట్టడాలు, కళాఖండాలను క్లిక్ మనిపించుకున్నారు. కార్యక్రమంలో వరంగల్ కో-ఆర్డినేటర్ మార్గం కుమారస్వామి, వరంగల్, హైదరాబాద్ ఎంసీహెచ్ ఆర్డీ సిబ్బంది, కేంద్ర పురావస్తు శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఆర్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో గురుపూజోత్సవం

మట్టెవాడ, జూన్ 29: రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్(ఆర్‌ఎస్‌ఎస్) ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 8 గంటలకు వరంగల్ రామన్నపేటలోని సుశీల్ గార్డెన్స్‌లో గురుపూజ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు వరంగల్ మహానగర్ సంఘ చాలక్ మోహన్‌రావు తెలిపారు. ఈ గురుపూజ మహోత్సవానికి ప్రధాన వక్తగా ఆర్‌ఎస్‌ఎస్ ప్రాంత కార్యకారిని సభ్యులు సుబ్రమణ్యం, ముఖ్య అతిథిగా రఘువీర్ హాజరవుతారని పేర్కొన్నారు.

నిర్మాణాత్మక ప్రజా పోరాటాలు చేపట్టాలి

ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కార్యదర్శి రవి



కార్యక్రమంలో మాట్లాడుతున్న గాదగోని రవి

గిర్మాజీ పేట, జూన్ 29 : ప్రజా సమస్యల పరిష్కారానికి నిర్మాణాత్మక పోరాటాలు చేపట్టాలని ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి పార్టీ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. శనివారం వరంగల్ అండర్‌బ్రిడ్జి సమీపంలోని ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యాలయంలో జిల్లా సహాయ కార్యదర్శి నర్రా ప్రతాప్ అధ్యక్షతన వరంగల్, హనుమకొండ జిల్లా కమిటీ సభ్యుల పార్టీ నిర్మాణ శిక్షణ తరగతులు జరిగాయి. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి రవి మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పార్టీ కమిటీలు పనిచేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన హామీలు అమలయ్యేంత వరకు నిరంతరం ప్రజా ఆందోళనలు చేపట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ వరంగల్, హనుమకొండ జిల్లాల కార్యదర్శులు పెద్దారపు రమేష్, హంసారెడ్డి, ఉమ్మడి జిల్లా నాయకులు గోనె కుమారస్వామి, బాబురావు, కొమురయ్య, రవిందర్, రాజిరెడ్డి, రాగసుధ, మాస్ సావిత్రి, వెంకన్న, కుమార్, సదానందం, రాజు, జన్ను రమేష్, ప్రభాకర్, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

నిద్రమత్తులో పెట్రోలింగ్ పోలీసులు

రాత్రి వేళల్లో వినిపించని సైరన్

విధుల్లో అలసత్వం.. కనిపించని గస్తీ

వాహనాల్లో కునుకు తీస్తున్న సిబ్బంది

మట్టెవాడ, జూన్ 29: శాంతిభద్రతల పరిరక్షణ, రాత్రి వేళల్లో దొంగలను పట్టుకోవడం, అల్లరి మూకలను అదుపు చేయడం, గొడవలను అరికట్టేందుకు వరంగల్ ప్రాంతంలో పోలీసు గస్తీ వ్యవస్థను పటిష్ఠం చేశారు. పెట్రోలింగ్‌లో బ్లూకోర్ట్స్ సిబ్బంది, ఇంటర్ సెక్టర్ సిబ్బంది, పోలీస్ స్టేషన్లు, బీట్‌ల వారీగా పోలీసులు రాత్రి వేళల్లో విధులు నిర్వహించేందుకు పోలీసు అధికారులు పక్కా ప్రణాళికను రూపొందించారు. కానీ, కొంత మంది పోలీసు సిబ్బంది నిద్రమత్తులో ఉండడంతో లక్ష్యాన్ని నీరుగారుస్తున్నారు. రాత్రి వేళల్లో సక్రమంగా విధులు నిర్వహించకుండా పోలీసు వాహనాన్ని కొందరు రోడ్డుపై, మరికొందరు గల్లీ రోడ్లలో నిలిపి ఆదమరిచి కునుకు తీస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఇటీవల ఉన్నతాధికారుల తనిఖీల్లో సైతం వెల్లడైనట్లు తెలిసింది. రాత్రి వేళల్లో విధులు నిర్వహించే పోలీసులు అప్రమత్తంగా ఉండాల్సింది పోయి కునుకు తీయడంపై ఉన్నతాధికారులు సీరియస్ అయినట్లు సమాచారం. వరంగల్ ప్రాంతంలో పోలీసు గస్తీ మూడు పోలీస్‌స్టేషన్ల పరిధిలో పూర్తిస్థాయిలో జరగడం లేదని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇటీవల నగరంలో దొంగల బెడద, రాత్రి వేళల్లో మందుబాబుల ఆగడాలు, గంజాయి గ్యాంగ్‌లు పెరిగాయి. ఇలాంటి పరిస్థితిలో విధుల్లో నిర్లక్ష్యం వహించడంపై ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కొంత మంది సిబ్బంది వల్లనే పోలీసు శాఖకు మచ్చ వస్తుందని కొందరు పోలీసులు అంటున్నారు.

రాత్రి డ్యూటీలపై ఆసక్తి..

కొంత మంది పోలీసులు నైట్ డ్యూటీలపై ఆసక్తి కనబరుస్తున్నట్లు తెలుస్తోంది. రాత్రి వేళల్లో పనిచేస్తే అంతగా ఒత్తిడి ఉండదని, దర్జాగా కునుకు తీయవచ్చనే ఆరోపణలు వస్తున్నాయి. అంతేకాదు రాత్రి వేళల్లో టిఫిన్ సెంటర్లు, మొబైల్ ఫుడ్ కోర్ట్స్, బార్ రెస్టారెంట్ల నుంచి తినుబండారాలు, వాటర్ బాటిల్స్ పొందుతున్నారు. దీంతో రాత్రి వేళల్లో పనిచేయడానికి కొంత మంది సిబ్బంది పోటీ పడుతున్నట్లు తెలిసింది. నిబంధనల ప్రకారం ప్రతి పోలీసు రాత్రి వేళల్లో విధులు నిర్వహించాల్సిందే. కానీ, కొంత మంది ఎక్కువ రోజులు నైట్ డ్యూటీ కేటాయించాలని ఒత్తిడి తెస్తున్నట్లు తెలుస్తోంది. వరంగల్‌లోని మండిబజార్, ఎల్‌బీనగర్, దేశాయిపేట రోడ్డు, కాశీబుగ్గ, ఏనుమాముల మార్కెట్ రోడ్డు, ఓసిటీ కాలనీ రోడ్డు, శివనగర్, అండర్ బ్రిడ్జి, ఎంజీ రోడ్డు, ఎస్వీఎన్ రోడ్డు, పోతన రోడ్డు, రామన్నపేట, వరంగల్ మేదారివాడ రోడ్డు, ఓసిటీ నర్సంపేట రోడ్డు, తెలంగాణ జంక్షన్ తదితర ప్రాంతాల్లో రాత్రి వేళల్లో బహిరంగంగా కొందరు మద్యం సేవించి అల్లర్లకు దిగుతున్నారు. పెట్రోలింగ్ పోలీసులు చూసీచూడనట్లుగా వ్యవరిస్తున్నారని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. బైక్ రేస్‌లతో పాటు అతివేగంగా వాహనాలు నడుపుతుండంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అర్ధరాత్రి వరకు బార్‌లు తెరిచి ఉండడంతో అటు ఎక్సైజ్ అధికారులు, స్థానిక పోలీసులు కట్టడి చేయడంలో విఫలం చెందారనే విమర్శలు వస్తున్నాయి. వరంగల్ పోలీస్ సబ్ డివిజన్ ప్రాంతంలో చాలా వరకు కాలనీల్లో పెంట్రోలింగ్ పోలీసులు పూర్తి స్థాయిలో గస్తీ నిర్వహించడం లేదని కాలనీల ప్రజలు చెబుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందిం చి పోలీసు పెట్రోలింగ్‌తో పాటు ఆకస్మిక తనిఖీలు చేపట్టాలని కోరుతున్నారు.



పోలీసు వాహనం

అనఘాష్టమి ఆచరణతో ఐశ్వర్యం కలుగుతుంది

దత్తక్షేత్రంలో సామూహికంగా వ్రతాల నిర్వహణ



దత్తక్షేత్రంలో వ్రతాలు నిర్వహిస్తున్న భక్తులు

వరంగల్ కల్చరల్, జూన్ 29: అష్టసిద్ధులతో కూడిన అనఘాదేవి, అనఘాస్వామిల అనఘాష్టమి వ్రతాన్ని ఆచరించుకుంటే కష్టాలు తొలగి ఐశ్వర్యం సిద్ధించి మంచి ఆరోగ్యం కలుగుతుందని దత్తప్రచారక్ కొక్కుల రాజేంద్రప్రసాద్ అన్నారు. శనివారం బహుళ అష్టమిని పురస్కరించుకొని వరంగల్ ములుగు రోడ్డులోని దత్తక్షేత్రంలో సామూహిక అనఘాష్టమి వ్రతాలు దాదాపు 200 మంది భక్తులు నిర్వహించారు. మహా మంగళహారతి, తీర్థప్రసాద వితరణ అనంతరం భక్తులందరికి మహా అన్నదానం చేశారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు వైవీ వామన్‌రావు, యుగంధర్, వడిచర్ల శ్రీనివాస్, అర్చకులు రాపాక గోపీకృష్ణ, భక్తులు పాల్గొన్నారు.

ముగిసిన స్పోర్ట్స్ హాస్టల్ ఎంపికలు

వరంగల్ స్పోర్ట్స్, జూన్ 29: స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ(సాట్) ఆదేశాల మేరకు రాష్ట్రంలోని వివిధ జిల్లా కేంద్రాల్లోని స్పోర్ట్స్ హాస్టళ్లలో విద్యార్థుల ప్రవేశాలకు నిర్వహిస్తున్న జిల్లాస్థాయి ఎంపిక పోటీలు శనివారం ముగిశాయి. వరంగల్ జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో మూడు రోజులుగా వరంగల్ ఓసిటీ క్రీడా మైదానంలో స్పోర్ట్స్ హాస్టల్‌లో 4వ తరగతిలో ప్రవేశాలు పొందేందుకు పోటీలు నిర్వహించినట్లు వరంగల్ డీవైఎస్‌వో టీవీఎల్.సత్యవాణి స్పష్టం చేశారు. జిల్లా స్థాయిలో వివిధ మండలాల నుంచి నిర్వహించిన ఈ ఎంపిక పోటీలలో 14మంది బాలురు, 11మంది బాలికలు పాల్గొన్నారన్నారు. ఇక్కడ జిల్లా స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను జూలై 9, 10 తేదీల్లో హకీంపేట స్పోర్ట్స్ స్కూల్ ఆవరణలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. కార్యక్రమంలో కోచ్‌లు వై.సుమన్, జె.లింగమూర్తి, ఎస్.కుమారస్వామి, ఇ.నాగరాజు, ఎస్.మహేష్, రవికుమార్, మౌనిక, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.



పరుగు పందెంలో పాల్గొన్న విద్యార్థిని

నీతి నిజాయితీతోనే పోలీసు ఉద్యోగానికి గౌరవం

ఫోర్త్ బెటాలియన్ కమాండెంట్ శివప్రసాద్‌రెడ్డి



సత్యనారాయణ, మల్లారెడ్డిలను సత్కరిస్తున్న కమాండెంట్ శివప్రసాద్‌రెడ్డి

శంభునిపేట, జూన్ 29 : క్రమశిక్షణకు మారుపేరైన పోలీసు శాఖలో అంకితభావంతో కూడిన నీతి నిజాయితే ఉద్యోగికి గౌరవాన్ని అందిస్తాయని మామునూరు టీజీఎస్‌పీ ఫోర్త్ బెటాలియన్ కమాండెంట్ డాక్టర్ డి.శివప్రసాద్‌రెడ్డి అన్నారు. బెటాలియన్‌కు చెందిన ఏఆర్‌ఎస్‌ఐలు ఎన్.సత్యనారాయణ, డి.మల్లారెడ్డిలకు మామునూరు క్యాంపులో శనివారం నిర్వహించిన అభినందన సభకు కమాండెంట్ శివప్రసాద్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పోలీసులంతా యూనిఫాంతో గర్వంగా విధులు నిర్వహిస్తుంటారని తెలిపారు. పోలీసు శాఖలో ర్యాంకులు శాశ్వతం కాదని, క్రమశిక్షణ, నిజాయితీలే శాశ్వతమని అన్నారు. తమ సర్వీసును పూర్తిచేసుకొని పదవీ విరమణ పొందిన సత్యనారాయణ, మల్లారెడ్డిలను సత్కరించారు. వారి విశ్రాంత జీవితం కుటుంబ సభ్యులతో ఆరోగ్యంగా, ఆనందంగా కొనసాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్లు కృష్ణప్రసాద్, శ్రీనివాస్, ఆర్‌ఐలు శోభన్, పురుషోత్తంరెడ్డి, రాజ్‌కుమార్, అశోక్, కృష్ణ, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

భద్రకాళి హుండీ ఆదాయం రూ.56.75 లక్షలు

వరంగల్ కల్చరల్, జూన్ 29: వరంగల్‌లోని భద్రకాళి దేవాలయంలో అమ్మవారికి భక్తులు వేసిన కానుకలను శనివారం లెక్కించారు. హుండీల్లోని కానుకలను లెక్కించగా రూ.56,75,293 ఆదాయం లభించినట్లు ఈవో శేషభారతి తెలిపారు. హుండీల్లో లభించిన బంగారు, వెండి వస్తువులు, విదేశీ కరెన్సీని హుండీల్లోనే వేసినట్లు చెప్పారు.



ఆలయంలో హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న దృశ్యం



చోరీ సొత్తుతోపాటు నిందితుడి అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న సీఐ

రైలులో పుస్తెలతాడు చోరీ చేసిన వ్యక్తి అరెస్టు

గిర్మాజీపేట, జూన్ 29: వరంగల్ రైల్వేస్టేషన్‌లో ఇటీవల ప్లాట్‌ఫారం-2పై పద్మావతి ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణికురాలి బంగారు పుస్తెలతాడు దొంగిలించిన ఓరుగు అశోక్‌కుమార్ అనే వ్యక్తిని శనివారం అరెస్టు చేసి రూ.1,81,668 విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు వరంగల్ జీఆర్‌పీ సీఐ జి.నరేష్ తెలిపారు. శనివారం వరంగల్ రైల్వే పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో సీఐ నరేష్ వివరాలను వెల్లడించారు. ఎస్సై అయిలయ్య ఆధ్వర్యంలో కానిస్టేబుళ్లు రాము, రామారావు, ఆర్‌పీఎఫ్ ఏఎస్సై ఎం.వెంకటేశ్వర్‌రావు, హెడ్ కానిస్టేబుళ్లు ఎస్.రాజు, వెంకటేశ్వరావు, సీఐబీ సిబ్బంది మనోజ్‌కుమార్, రోహత్‌షాలతో కలిసి శనివారం వరంగల్ రైల్వేస్టేషన్‌లో తనిఖీలు చేపట్టారు. ప్లాట్‌ఫారం-2, 3 మధ్య ఫుట్‌ఓవర్ బ్రిడ్జి సమీపంలో పోలీసు బృందం తనిఖీలు చేస్తుండగా అనుమానాస్పదంగా కనిపించిన ఓరుగు అశోక్‌కుమార్‌ను విచారించారు. ఇటీవల వరంగల్ రైల్వే స్టేషన్‌లో పద్మావతి ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణికురాలి బంగారు పుస్తెలతాడు చోరీ చేసిన విషయాన్ని అంగీకరించాడని, నిందితుడి వద్ద చోరీ చేసిన పుస్తెలతాడును స్వాధీనం చేసుకుని కాజీపేట రైల్వే కోర్టులో హాజరుపర్చి రిమాండ్ చేసినట్లు సీఐ నరేష్ తెలిపారు. సమావేశంలో ఎస్సై ఎం.అయిలయ్య పాల్గొన్నారు.

దొంగతనానికి వచ్చాడని చితకబాదిన ప్రజలు



స్థానికులు దేహశుద్ధి చేసిన వ్యక్తి

కరీమాబాద్, జూన్ 29: అర్ధరాత్రి సమయంలో తాళం వేసి ఉన్న ఇంటి ముందు తచ్చాడుతూ కనిపించిన ఓ వ్యక్తిని దొంగతనానికి వచ్చినట్లు భావించిన స్థానికులు కట్టేసి చితకబాది పోలీసులకు అప్పగించారు. ఈ సంఘటన వరంగల్ పుప్పాలగుట్ట ప్రాంతంలో చోటుచేసుకుంది. ఈ ఘటనకు సంబంధించి శనివారం సోషల్ మీడియాలో ప్రచారం జరిగింది. ఈ విషయమై మిల్స్‌కాలనీ సీఐ మల్లయ్యను వివరణ కోరగా రెండు రోజుల క్రితం పుప్పాలగుట్టలో అర్ధరాత్రి సమయంలో ఓ వ్యక్తి టవల్‌పై ఉండి కాలనీలో సంచరించాడు. స్థానికులు దొంగతనానికి వచ్చాడని అతడిని పట్టుకొని కట్టేసి కొట్టి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఆవ్యక్తిని అదుపులోకి తీసుకొని విచారించగా పొంతనలేని సమాధానం ఇవ్వడంతో మతిస్థిమితం సరిగాలేకపోవడంతో వదిలేసినట్లు సీఐ మల్లయ్య తెలిపారు.

అనారోగ్యంతో జూనియర్ అసిస్టెంట్ మృతి



రవీందర్ (ఫైల్)

సంగెం, జూన్ 29: సంగెం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న నాగుల రవీందర్(52) అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. గత నెల రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ నగరంలోని పలు ఆస్పత్రుల్లో చికిత్స పొందినప్పటికి ఆరోగ్యం క్షీణించడంతో కుటుంబ సభ్యులు స్వగ్రామమైన ములుగు జిల్లా ఏటూరునాగారంకు రవీందర్ తరలించగా మృతి చెందారు. దహన సంస్కారాలు ఆదివారం నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కాగా, రవీందర్ మృతి పట్ల సంగెం ప్రజలు, పాఠశాల ఉపాధ్యాయులు సంతాపం తెలిపారు.

నత్తనడకన అండర్ డ్రైయినేజీ పనులు

ఇబ్బంది పడుతున్న 34, 35, 36 డివిజన్ల ప్రజలు

నాలుగేళ్లుగా నరకయాతన పడుతున్న స్థానికులు

ఖిలావరంగల్, జూన్ 29: వరంగల్ నగరంలో అండర్ డ్రైయినేజీ పనులు నత్తనడకన సాగుతున్నాయి. దీంతో 34, 35, 36 డివిజన్ల ప్రజలు డ్రైయినేజీ పనులు పూర్తికాక పోవడంతో నాలుగేళ్ల నుంచి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లు, డ్రైయినేజీలు, విద్యుత్ దీపాలు, తాగునీరు తదితర సమస్యలతో సతమతమవుతున్నారు. 19 నవంబరు, 2020లో స్మార్ట్ సిటీ పనుల్లో భాగంగా అప్పటి ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ స్థానిక ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్‌తో కలిసి ఖిలావరంగల్ మాలఅగర్తల చెరువు నుంచి శివనగర్ మీదుగా అండర్‌బ్రిడ్జి వరకు 2 కిలోమీటర్ల దూరంలో అండర్ డ్రైయినేజీ పనులకు రూ.50 కోట్లతో శంకుస్థాపన చేశారు. ముందుగా శివనగర్ పల్లవి ఆస్పత్రి నుంచి ప్రశాంతి ఆస్పత్రి వరకు పనులను ప్రారంభించారు. ఆ తర్వాత ఎస్సీ కాలనీ, పాకివాడ, శివనగర్, మసీద్, మీదుగా ప్రస్తుతం ఏసీ రెడ్డినగర్ వరకు 10ఫీట్ల లోతు, 40ఫీట్ల వెడల్పుతో అండర్ డ్రైయినేజీ పనులు నాలుగేళ్లుగా సాగుతూనే ఉన్నాయి. ఖిలావరంగల్ మాలఅగర్తల చెరువు నుంచి మట్టికోట సమీపంలోని శ్మశానవాటిక వరకు పనులు జరుగుతున్నాయి. ఇటీవల చింతల్, క్రిస్టియన్‌కాలనీ, లేబర్‌కాలనీ, వరంగల్ రైల్వేస్టేషన్ నుంచి వచ్చే డ్రైయినేజీ, వర్షం నీటిని అండర్ డ్రైయినేజీ కాలువలో కలిపేందుకు మరో మూడు మార్గాలలో డ్రైయినేజీ పనులను సంబంధిత అధికారులు చేపట్టారు.

చింతల్ బ్రిడ్జి కింద, కట్టమైసమ్మ దేవాలయం నుంచి వరంగల్ రైల్వేస్టేషన్‌కు వెళ్లే దారిలో అండర్ డ్రైయినేజీ పనుల కారణంగా మూడు నెలలుగా రోడ్డును(అభివృద్ధి పనుల్లో భాగంగా) మూసివేశారు. తూర్పుకోట, వంచనగిరి, స్తంభంపెల్లి, దూపకుంట, వసంతపూర్, చింతలపెల్లి తదితర గ్రామాలతో పాటు వివిధ గ్రామాల నుంచి వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌కు ట్రాక్టర్, డీసీఎం, మినీట్రాలీ, ఆటోల ద్వారా వ్యవసాయ సరుకులను తీసుకువెళ్లే రైతులు, స్కూల్ బస్సులు, పాలు, కూరగాయలను మార్కెట్‌కు తీసుకువెళ్లే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఏసీరెడ్డినగర్, శివనగర్, చింతల్, పుప్పాలగుట్ట 34, 35, 36 డివిజన్ల ప్రజలు శివనగర్ శ్మశానవాటికలో దహన సంస్కారాలు చేసేందుకు దారి లేక అవస్థలు పడుతున్నారు.



శివనగర్‌లో జరుగుతున్న అండర్ డ్రైయినేజీ పనులు

రోడ్లు, డ్రైయినేజీలు, తాగునీరు కరువు

శివనగర్, పుప్పాలగుట్ట, శివనగర్ రైల్వేస్టేషన్, చింతల్ బ్రిడ్జి తదితర ప్రాంతాల్లో అండర్ డ్రైయినేజీ పనుల కారణంగా రోడ్లు, విద్యుత్ దీపాలు, డ్రైయినేజీలు, తాగునీరు సక్రమంగా రాక పోవడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పక్కనే శివనగర్ వాటర్‌ట్యాంక్, పుప్పాలగుట్ట వాటర్ ట్యాంక్‌లున్నా పైప్‌లైన్లు లేకపోవడంతో వర్షాకాలంలో సైతం తాగునీటి ఎద్దడి ఏర్పడుతోందని వాపోతున్నారు. డ్రైయినేజీ పనుల కారణంగా రోడ్లపై భారీ గుంతలు తీయడంతో ఎప్పుడు ఏప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు, ప్రజలు జంకుతున్నారు. అలాగే విద్యుత్ దీపాలు లేక రాత్రివేళ అంధకారం అలుముకుంటోందని చెబుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి అండర్ డ్రైయినేజీ పనులు త్వరగా పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని ఆయా డివిజన్ల ప్రజలు కోరుతున్నారు.





చింతల్ బ్రిడ్జి కింద జరుగుతున్న పనులు, చింతల్ బ్రిడ్జి వద్ద అభివృద్ధి పనులు జరుగుతున్నందున రోడ్డు డైవర్షన్ బోర్డు

సీఎంకు ఘన స్వాగతం

గీసుగొండ, జూన్ 29: ముఖ్యమంత్రి హోదాలో శనివారం తొలిసారి జిల్లా పర్యటనకు వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డికి కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు, హెలిప్యాడ్ వద్ద పలువురు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, అధికారులు ఘన స్వాగతం పలికారు. మధ్యాహ్నం 01.10 గంటలకు హెలికాప్టర్‌లో చేరుకున్న సీఎంకు మంత్రులు కొండా సురేఖ, సీతక్క, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీఎస్ శాంతికుమారి, డీజీపీ రవిగుప్తా, ప్రభుత్వ విప్ రామచంద్రు నాయక్, నగర మేయర్ గుండు సుధారాణి, ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాష్‌రెడ్డి, కడియం శ్రీహరి, నాగరాజు, నాయిని రాజేందర్‌రెడ్డి, యశస్వినిరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు, కలెక్టర్ డాక్టర్ సత్యశారదాదేవి తదితరులు స్వాగతం పలికారు.



సీఎంకు స్వాగతం పలుకుతున్న మంత్రి సురేఖ, ఎంపీ కావ్య

మహాజన సభను విజయవంతం చేయండి

వరంగల్ అర్బన్ కోఆపరేటివ్ బ్యాంకు చైర్మన్ ప్రదీప్‌రావు

వరంగల్ సిటీ, జూన్ 29: నగరంలోని దేశాయిపేట రోడ్డులో గల కేఆర్ గార్డెన్‌లో ఆదివారం జరిగే వరంగల్ అర్బన్ కోఆపరేటివ్ బ్యాంకు మహాజన సభను విజయవంతం చేయాలని బ్యాంకు చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు అన్నారు. శనివారం కాశిబుగ్గలోని ఆ బ్యాంకు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వరంగల్ అర్బన్ కోఆపరేటివ్ బ్యాంకును అన్ని విధాలుగా అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళ్తున్నామన్నారు. అన్ని వివరాలు సభ్యులకు తెలిపేందుకే మహాజన సభను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

బ్యాంకు 2023- 24 సంవత్సర వార్షిక నివేదిక పరిశీలన, ఆమోదం తెలిపే అంశాలు ఉంటాయన్నారు. ఆడిట్ నివేదిక, ఆర్థిక పట్టిక, ఆదాయ, వ్యయ, 2024-25 అంచనా బడ్జెట్ పరిశీలన, బైలాలోని నంబరు 2 సవరణ తిరిగి రాయబడిన పద్దుల విషయంలో పరిశీలనాంశాలపై చర్చించడం జరుగుతుందన్నారు. గత సంవత్సర కాలంలో నూతనంగా చేరిన సభ్యులకు వాటాల కేటాయింపు, సభ్యత్వంపై చర్చించి ఆమోదించే అంశాలపై చర్చ సాగుతుందని ప్రదీప్‌రావు పేర్కొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎర్రబెల్లి ప్రదీప్‌రావు



ఆంధ్రజ్యోతి WARANGAL RURAL ఆదివారం 30 జూన్ 2024

వరంగల్ రూరల్

• నర్సంపేట • దుగ్గొండి • చెన్నారావుపేట • ఖానాపురం • నల్లబెల్లి • నెక్కొండ • పర్వతగిరి • వర్ధన్నపేట • రాయపర్తి • సంగెం • గీసుగొండ

'ఏబీఎస్ఎఫ్ పోరాట ఫలితంగానే గురుకుల ప్రిన్సిపాళ్ల నియామకం'

నర్సంపేట టౌన్, జూన్ 29 : ఏబీఎస్ఎఫ్ పోరాట ఫలితంగానే తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా మహాత్మజ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలలో రెగ్యులర్ ప్రిన్సిపాల్స్‌ను ప్రభుత్వం నియమించిందని ఏబీఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బొట్ల నరేష్ అన్నారు. నర్సంపేటలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జ్యోతిరావుపూలే గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో రెగ్యులర్ ప్రిన్సిపాల్స్ లేకపోవడం వల్ల విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు రుచికరమైన భోజనం అందడంలేదని హైదరాబాద్‌లోని గురుకుల కళాశాల కార్యాలయం ఎదుట గత రెండేళ్ల క్రితం నిరసన ప్రదర్శన చేయడంతో పాటు పలు మార్లు విద్యాశాఖ ఉన్నతాధికారులకు వినతి పత్రాలు అందించామన్నారు. ఎట్టకేలకు మహాత్మజ్యోతిరావుపూలే గురుకుల పాఠశాలలో రెగ్యులర్ ప్రిన్సిపాల్స్‌ను నియమించడంపై రాష్ట్ర ప్రభుత్వానికి, బీసీ సంక్షేమ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు, జ్యోతిరావుపూలే గురుకుల కళాశాల సెక్రటరీ సైదులుకు నరేష్ కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో ప్రశాంత్, భూషన్, పటేల్, రాజు, కృష్ణ, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డికి ఘన స్వాగతం



సీఎంకు స్వాగతం పలుకుతున్న మంత్రి కొండా సురేఖ, ఎంపీ కావ్య

గీసుగొండ, జూన్ 29 : ముఖ్యమంత్రి హోదాలో శనివారం తొలిసారి జిల్లా పర్యటనకు వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డికి కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు హెలిప్యాడ్ వద్ద పలువురు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, అధికారులు ఘన స్వాగతం పలికారు. మధ్యాహ్నం 1.10 గంటలకు హెలికాప్టర్‌లో చేరుకున్న సీఎంకు మంత్రులు కొండా సురేఖ, సీతక్క, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీఎస్ శాంతికుమారి, డీజీపీ రవిగుప్తా, ప్రభుత్వ విప్ రామచంద్రు నాయక్, నగర మేయర్ గుండు సుధారాణి, ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాష్‌రెడ్డి, కడియం శ్రీహరి, నాగరాజు, నాయిని రాజేందర్‌రెడ్డి, యశస్వినిరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు, కలెక్టర్ డాక్టర్ సత్యశారదాదేవి తదితరులు స్వాగతం పలికారు.

విద్యా హక్కు చట్టాన్ని అతిక్రమిస్తే కఠిన చర్యలు

• ఎంఈవో సత్యనారాయణ



పేరెంట్స్‌తో మాట్లాడుతున్న ఎంఈవో సత్యనారాయణ

నల్లబెల్లి, జూన్ 29 : విద్యాహక్కు చట్టాన్ని అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని నల్లబెల్లి ఎంఈవో చదువుల సత్యనారాయణ అన్నారు. ఈ మేరకు శనివారం మండల కేంద్రంలోని శ్రీఆదర్శవాణి విద్యానికేతన్ పాఠశాలలో తనిఖీ చేశారు. స్కూల్ ప్రిన్సిపాల్‌తో, విద్యార్థుల తల్లిదండ్రులతో అధిక ధరలకు పుస్తకాలు అమ్మడంపై సమగ్ర విచారణ చేపట్టారు. ఎంఈవో మాట్లాడుతూ.. పాఠశాలలో అధిక ధరలకు పాఠ్యపుస్తకాలను అమ్మితే చట్టపరమైన చర్యలు తీసు కుంటామని హెచ్చరించారు. అనంతరం ఈ విచారణకు సంబంధించిన అంశాలను జిల్లా విద్యాశాఖ అధికారికి నివేదికను సమర్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంఐఎస్ కో-ఆర్డినేటర్ రాజేశ్వరి, సీఆర్‌పీ రవి, ఉపాధ్యాయులు, పేరెంట్‌లు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి



నెక్కొండ తండాలో మాట్లాడుతున్న ఆర్ఐ నరేందర్


నెక్కొండ, జూన్ 29 : ప్రతి పౌరుడు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని నెక్కొండ మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నరేందర్ చెప్పారు. మండలంలోని నెక్కొండ తండాలో శనివారం జరిగిన పౌర హక్కుల దినోత్సవ సభల్లో ఆయన మాట్లాడారు. ప్రతి పౌరుడు తమ బాధ్యతగా సమాజ సేవ చేయాలని, జీవనోపాధిని పొందుటకుగాను ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగ పర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు మాంకాల యాదగిరి, ఐసీడీఎస్ సూపర్ వైజర్ వాసంతి, వెలుగు ఏపీఎం శ్రీనివాస్, ఏఈవో వాసంతి, రాజేంద్రప్రసాద్, సరస్వతి, కార్యదర్శి మహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

సబ్ పోస్టుమాస్టర్‌పై దాడి చేసిన వ్యక్తిపై కేసు

చెన్నారావుపేట, జూన్ 29 : సబ్ పోస్టు మాస్టర్‌పై దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై గూడ అరుణ్‌కుమార్ శనివారం తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. మండల కేంద్రంలోని పోస్టాఫీసులో పి.రాజుకుమార్ సబ్ పోస్టుమాస్టర్‌గా పనిచేస్తున్నాడు. పోస్టాఫీసులో విధులను నిర్వర్తిస్తున్న క్రమంలో వి.రాజుకుమార్ అనే వ్యక్తి పాత కక్షలను దృష్టిలో పెట్టుకొని సబ్ పోస్టుమాస్టర్ పి.రాజుకుమార్‌ను నానా దుర్భాషలాడుతూ దాడికిపాల్పడ్డాడు. దీంతో బాధితుడు పి.రాజుకుమార్ ఫిర్యాదు మేరకు వి.రాజుకుమార్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

అనారోగ్యంతో జూనియర్ అసిస్టెంట్ మృతి

సంగెం, జూన్ 29 : సంగెం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న నాగుల రవీందర్ (52) అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. గత నెల రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ నగరంలోని పలు ఆస్పత్రుల్లో చికిత్స పొందినప్పటికీ ఆరోగ్యం క్షీణించడంతో కుటుంబ సభ్యులు స్వగ్రామమైన ములుగు జిల్లా ఏటూరునాగారానికి రవీందర్‌ను తరలించగా మృతి చెందారు. దహన సంస్కారాలు ఆదివారం నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కాగా, రవీందర్ మృతి పట్ల సంగెం ప్రజలు, పాఠశాల ఉపాధ్యాయులు సంతాపం తెలిపారు.



రవీందర్ (ఫైల్)

పేకాటరాయుళ్ల అరెస్టు

పర్వతగిరి, జూన్ 29 : మండలకేంద్రంలో పేకాట ఆడు తున్న వారిని అరెస్టు చేసినట్లు ఎస్సై గుగులోత్ వెంకన్న తెలిపారు. శనివారం ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని కొమ్మరాజు ఉప్పలయ్య అనే వ్యక్తి ఇంట్లో పేకాట ఆడుతున్న సమాచారం మేరకు దాడులు నిర్వహించి కొమ్మరాజు ఉప్పలయ్య, బాసాని క్రాంతి, ఓర్సు శ్రీకాంత్, పుల్లూరి రాజు, చెన్నూరి కుమారస్వామి అనే ఐదుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.7,180 నగదుతో పాటు నాలుగు సెల్ ఫోన్లు, 52 పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది రాజు, లింగమూర్తి, ఆశీర్వాదం తదితరులు పాల్గొన్నారు.

సమాజంలో గురువుల బాధ్యత గొప్పది

• రీజినల్ జాయింట్ డైరెక్టర్ సత్యనారాయణ రెడ్డి

గీసుగొండ, జూన్ 29 : విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దే గురువుల బాధ్యత సమాజంలో ఎంతో గొప్పదని విద్యాశాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ సత్యనారాయణరెడ్డి అన్నారు. మండలంలోని ఎలుకుర్తిలో జడ్పీ పాఠశాల గెజిటెడ్ హెచ్‌ఎం మండల బాలకుమార్ పదవీ విరమణ సన్మాన సభ శనివారం నిర్వహించారు. బాలకుమార్ దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా వ్యవస్థలో బాలకుమార్ నిబద్ధతతో పనిచేసి ఉపాధ్యాయులకు ఆదర్శంగా నిలిచారన్నారు. కార్యక్రమంలో ఎంఈవో చదువుల సత్యనారాయణ, మండల నోడల్ అధికారులు రవిందర్, సుజన్‌తేజ, హెచ్‌ఎంలు రజాక్, పట్టాభి, సాంబయ్య, అనిత, జ్యోతిర్మయి, ఉపాధ్యాయ సంఘాల నేతలు, ఉపాధ్యాయులు, సీఆర్పీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

పంటల నమోదే కీలకం

రైతు భరోసా, పంటల కొనుగోళ్లకు ఇదే ఆధారం
పంట భూములకు డిజిటల్ సర్వే
సర్వే ఆధారంగానే పథకాల వర్తింపు

వర్ధన్నపేట, జూన్ 29 : రైతు భరోసా అందించాలన్నా... పండించిన పంటలకు ప్రభుత్వం కొనుగోలు చేయాలన్నా ... పంటల నమోదు కీలకంగా మారనుంది. దీనికోసం ప్రభుత్వం ప్రత్యేకంగా సర్వేహించాలని భావిస్తుంది. పంటల నమోదును కూర్చున్న చోట కాకుండా క్షేత్రస్థాయికి వెళ్లి నమోదు చేసేలా ప్రభుత్వ ప్రణాళికలు రూపొందిస్తుంది. పంట నమోదే కీలకంగా మారుతున్న నేపథ్యంలో ప్రభుత్వం దీనిపై ప్రత్యేకంగా దృష్టిసారిస్తోంది. ప్రతి యేటా వ్యవసాయసాయ అధికారులు పంటల నమోదును చేస్తున్నా పకడ్బందీగా చేయడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. క్షేత్రస్థాయిలో పంటల పరిశీలన చేయకుండా రైతులు చెప్పిన పంటల నమోదు చేశారన్న విమర్శలు తలెత్తుతున్నాయి. నమోదు చేసిన పంటకు, వాస్తవానికి పండించిన పంటలకు చాలా చోట్ల భిన్నంగా ఉండటంతో ప్రభుత్వం పంటలను కొనుగోలు చేసినపుడు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఇక కొంతమంది వ్యాపారులు తమ అనుకూలంగా ఉండే రైతుల పంటలను అధికారుల చేత తప్పుగా నమోదు చేయిస్తున్నారు. ప్రభుత్వం పంటలను కొనుగోలు చేసే సమయంలో సదరు రైతుల పేరిట వ్యాపారులు తమ పంటలను విక్రయాలు జరుపుతున్నట్లు తెలుస్తోంది.



పంటల సర్వే నిర్వహిస్తున్న ఏఈవోలు

సాగు భూములకే రైతు భరోసా !

గత ప్రభుత్వ హయాంలో కొండలు, గుట్టలు, మైదాన ప్రాంతాలు, వెంచర్లలో పంటలు పండించకున్నా రైతు బంధు ద్వారా పెట్టుబడి సహాయాన్ని అప్పటి ప్రభుత్వం అందించింది. అయితే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం సాగుభూమికి మాత్రమే రైతు భరోసా పేరిట పెట్టుబడి సాయాన్ని అందించనున్నట్లు తెలుస్తోంది. సాగు భూములను నిర్ధయించేందుకు ప్రభుత్వం వ్యవసాయ అధికారులతో సర్వే చేయించాలని భావిస్తోంది. అధికారులు క్షేత్రస్థాయిలో పంటల సాగు వివరాలు, విస్తీర్ణం నమోదు చేయాల్సి ఉంటుంది. ఇందుకోసం యాప్‌ను ఉపయోగించనున్నారు. సాగు చేసే పంటల ఫోటోను, సంబంధిత సర్వే నెంబర్ భూమిలోనే ఉండి ఫోటో తీయాల్సి ఉంటుంది. దీంతో పంటల సాగు వివరాలు నమోదులో అవకతవకలకు పాల్పడే అవకాశం ఉండదు. మరో వైపు కేంద్రం అనుమతితో డిజిటల్ క్రాప్ సర్వేను నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తోంది. పక్కా సాగు వివరాల నమోదు చేసిన తరువాత రైతు భరోసాతో పాటు ఇతర పథకాలను అమలు చేయడానికి సులువు అవుతుందని ప్రభుత్వం భావిస్తోంది.

పంటల నమోదే ఆధారం ..

ప్రభుత్వం ప్రతి యేటా వివిధ రకాల పంటలను కొనుగోలు చేస్తుంది. పంటల కొనుగోళ్లకు సైతం పంటల నమోదు ఆధారంగానే ప్రభుత్వం కొనుగోళ్లు చేయనుంది. సర్వే ఆధారంగా రైతు ఎంత విస్తీర్ణంలో ఏయే పంటలు పండించారో ఆన్‌లైన్‌లో రికార్డు అవుతుంది. ఆ రైతుకు సంబంధించిన రికార్డు ఆధారంగానే పంటలను కొనుగోలు చేసే వీలుంటుంది. అయితే ప్రభుత్వం ఎకరాకు పరిమితి విధిస్తే రైతు నష్టపోయే ప్రమాదం ఉంది.

కురిసిన వర్షం.. రోడ్డు జలమయం



నర్సంపేటలో ప్రధాన రోడ్డుపై నిలిచిన వరద నీటిలో వెళ్తున్న వాహనాలు, మాధన్నపేట రోడ్డులో ఇండ్ల మధ్య రోడ్డుపై ప్రవహిస్తున్న వరద నీరు, చెన్నారావుపేటలో కురుస్తున్న వర్షం

చల్లబడిన వాతావరణం

మొలకెత్తిన పంటలకు ఊపిరిపోసిన వర్షం

నర్సంపేట, జూన్ 29 : నర్సంపేట నియోజకవర్గంలో గంట పాటు శనివారం భారీ వర్షం కురిసింది. సాయంత్రం 4.30 నిమిషాలకు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం ప్రారంభమై గంట పాటు కురిసిన భారీ వర్షంతో పట్టణంలోని పలు ప్రధాన రహదారులు జలమయమయ్యాయి. కొద్దిసేపు వర్షం నీటి గుండా వెళ్లడానికి వాహనదారులు ఇబ్బందులకు గురయ్యారు. పట్టణంలోని పలు వీధుల్లో మురికి నీరు కాలువల నిర్మాణాలు లేక ఇండ్ల ముందున్న ఇరుకు రోడ్లపై వరద నీరు ప్రవహించింది.

ఇండ్ల ముందు వరద నీరు చేరటంతో ప్రజలు ఇబ్బందులు గురికావల్సి వచ్చింది. గ్రామాల్లో కూడా వర్షం కురిసింది. నల్లబెల్లి, ఖానాపురం. దుగ్గొండి. చెన్నారావుపేట మండలాల్లో వర్షం పడింది. గత కొద్ది రోజులుగా ఎండ వేడిమి ఉక్కపోతలో ఇబ్బందులకు గురైన ప్రజలు వాతారణం చల్లబడడంతో ఉపసంహనం పొందుతున్నారు. కురిసిన వర్షం మొలకెత్తిన పత్తి, మొక్కజొన్న ఇతర పంటకు ఊపిరి పోసినట్లైంది.

• చెన్నారావుపేట : మండలంలోని పలు గ్రామాల్లో శనివారం సాయంత్రం అరగంట పాటు భారీ వర్షం కురిసింది. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఉదయం తీవ్రంగా కొట్టిన ఎండతో ప్రజలు ఉక్కిరి బిక్కిరియ్యారు. సాయంత్రం వర్షం కురవడంతో కాస్తా వాతారణం చల్ల బడింది. వర్షం కురిసి పత్తి, మొక్కజొన్న పంటలకు జీవం పోసిందని గ్రామస్థులు, రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఉద్యోగికి ఉద్యోగ విరమణ తప్పనిసరి

పర్వతగిరి, జూన్ 29 : ఉద్యోగికి ఉద్యోగ విరమణ తప్పనిసరి అని ఎంపీపీ లూనావత్ కమలపంతులు అన్నారు. మండలంలోని బూర్గుమళ్ల గ్రామ పంచాయతీ కార్యదర్శి జూకంటి సత్యనారాయణ దంపతులను మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో సన్మానించారు. ఆమె మాట్లాడుతూ ఉద్యోగ జీవితంలో ప్రజల మన్ననలు పొందినప్పుడే సార్థకత ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీలు బొట్ల మహేంద్ర, మాడుగుల రాజు, జడ్పీ కోఆప్షన్ మెంబర్ సర్వర్, ఎంపీడీవో శంకర్, ఎంపీవో పాక శ్రీనివాసులు, అనంతారం మాజీ సర్పంచ్ దేవేందర్, ఇస్లావత్‌తండా మాజీ సర్పంచ్ రమేష్, పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ పొందిన హెచ్‌ఎంకు సన్మానం

దుగ్గొండి, జూన్ 29 : మండలంలోని తిమ్మంపేట పీజీ హెచ్‌ఎం దార స్వామి ఉద్యోగ విరమణ పొందగా, శనివారం జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాస్, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానం చేశారు. శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతీ ఉద్యోగికి ఉద్యోగ విరమణ ఉంటుందన్నారు. పని చేసే దగ్గర నిర్వహిస్తున్న పని తీరును బట్టి గుర్తింపు లభిస్తుందన్నారు. ఈ సన్మానంలో పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు పరపాటి సుధాకర్ రెడ్డి, టీపీటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి ఈదుల వీరస్వామి, హెచ్‌ఎంలు జ్యోతిలక్ష్మి, దూలం రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

గోవిందరావు సేవలు మరువలేనివి..

చెన్నారావుపేట, జూన్ 29 : చెన్నారావుపేట మండల ఎంపీడీవోగా గోవిందరావు చేసిన సేవలు మరువలేనివని ఎంపీపీ బాదావత్ విజేందర్, జడ్పీ సీఈవో రాంరెడ్డిలు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో గోవిందరాజు ఉద్యోగ విరమణ సన్మాన సభను ఘనంగా నిర్వహించారు. వారు మాట్లాడుతూ గోవిందరావు తన 35ఏళ్ల ఉద్యోగ కాలంలో ప్రజలకు అందించిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ పత్తినాయక్, సూర్యపేట డీఆర్ డీఏ డీపీవో మధు సూదన్, తహసీల్దార్ ఫణికుమార్, డిప్యూటీ సీఈవో పవన్‌కుమార్, శ్రీనువాస్, ఏఈవో రత్న మాల, హెచ్‌ఎం పాపమ్మ, ఎస్‌వో అరుణ, ఎంపీవో శ్రీధర్‌రాజు, ఖమ్మం డీపీఎం శ్రీనవాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి డీఎస్ మృతికి సంతాపం

నెక్కొండ, జూన్ 29 : మాజీ మంత్రి, పీసీసీ మాజీ అధ్యక్షుడు ధర్మపురి శ్రీనివాస్ మృతి పట్ల నెక్కొండ మాజీ ఎంపీపీ , జడ్చర్ల నియోజకవర్గం బీజేపీ ఇన్‌చార్జ్ గటిక అజయ్‌కుమార్ సంతాపాన్ని వ్యక్తం చేశారు. శనివారం హైదరాబాద్‌లో శ్రీనివాస్ మృత దేహంపై పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులను అజయ్‌కుమార్ పరామర్శించి సానుభూతిని తెలిపారు. డీఎస్‌తో తనకు ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు.

భద్రకాళి హుండీ ఆదాయం రూ.56.75 లక్షలు

వరంగల్ కల్చరల్, జూన్ 29 : వరంగల్‌లోని భద్రకాళి దేవాలయంలో అమ్మవారికి భక్తులు వేసిన కానుకలను శనివారం లెక్కించారు. హుండీల్లోని కానుకలను లెక్కించగా రూ.56,75,293 ఆదాయం లభించినట్లు ఈవో శేష భారతి తెలిపారు. హుండీల్లో లభించిన బంగారు, వెండి వస్తువులు, విదేశీ కరెన్సీని హుండీల్లోనే వేసినట్లు చెప్పారు.

కేయూ బీపీఈడీ పరీక్షలు షురూ

కేయూ క్యాంపస్, జూన్ 29: కాకతీయ యూనివర్సిటీ బీపీఈడీ నాలుగో సెమిస్టర్ పరీక్షలు శనివారం ప్రారంభమయ్యాయి. కేయూ పరీక్షల తీరును కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ చాడ రాధికా రెడ్డి పరిశీలించారు. ఇతర సబ్జెక్టు పరీక్షలు జూలై 1, 3, 5వ తేదీల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1వరకు పరీక్షలు జరుగుతాయని వెల్లడించారు. కేయూ క్యాంపస్‌లోని యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్, ఖమ్మంలోని ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో పరీక్షల కేంద్రాలను ఏర్పాటు చేశారు.

కోటను సందర్శించిన శ్రీలంకవాసులు

ఖిలావరంగల్, జూన్ 29 : చారిత్రక ప్రసిద్ధి చెందిన కాకతీయుల కాలంనాటి దేవాలయాలు, కట్టడాలు, శిల్ప సంపదను హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల శిక్షణ కేంద్రంలో శిక్షణ పొందుతున్న శ్రీలంకకు చెందిన 29 మంది ట్రైనీ జర్నలిస్టులు సందర్శించారు. శనివారం ఖిలావరంగల్ మధ్యకోటలోని శిల్పాలను శిక్షణలో భాగంగా ట్రైనీ జర్నలిస్టులు తిలకించారు. కీర్తితోరణాలు, ఖుష్‌మహల్, ఏకశిలగుట్ట, సింగారపు బావి, స్వయంభూ దేవాలయం, రాతి, మట్టి కోటలను వారు ఆసక్తిగా తిలకించారు. తెలంగాణ రాష్ట్ర పర్యాటక శాఖ అధికారి కుసుమ సూర్యకిరణ్ కాకతీయుల చరిత్ర, విశేషాలను వారికి తెలిపారు. వారు తమ వెంట తెచ్చుకున్న కెమెరా, సెల్‌ఫోన్లలో కోటలోని కాకతీయుల అద్భుత, కట్టడాలు, కళాఖండాలను క్లిక్ మనిపించుకున్నారు. కార్యక్రమంలో వరంగల్ కో-ఆర్డినేటర్ మార్గం కుమారస్వామి, వరంగల్, హైదరాబాద్ ఎంసీహెచ్ ఆర్‌డీ సిబ్బంది, కేంద్ర పురావస్తు శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

మిషన్ భగీరథ నీరు ఇంటికి వస్తోందా?

నల్లా కనెక్షన్లపై ఇంటింటి సర్వే

వర్ధన్నపేట మండలంలో 94 శాతం పూర్తి

వర్ధన్నపేట రూరల్, జూన్ 29 : గ్రామీణ ప్రాంత ప్రజలకు స్వచ్ఛమైన నీటిని అందించాలనే లక్ష్యంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం మిషన్ భగీరథ పథకాన్ని తీసుకువచ్చింది. దీని ద్వారా ఇంటింటికి నల్లా కనెక్షన్లు అందించి శుద్ధి చేసిన నీటిని అందించింది. నీటి ట్యాంకులు లేని చోట ట్యాంకులను, పైపు లైన్లు లేని చోట నూతనంగా పైపులు వేసి ఇంటి ముందు నల్లాను ఏర్పాటు చేశారు. కానీ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ పెట్టి మిషన్ భగీరథ పథకంపై దృష్టిసారించారు. క్షేత్రస్థాయిలో నీరు అందుతుందా లేదా అనే విషయాలను సంపూర్ణంగా తెలుసుకుని ప్రత్యేక పోర్టల్ ద్వారా ఆన్‌లైన్ చేయాలని ఆదేశించడంతో గత కొన్ని రోజులుగా మండలంలో మిషన్ భగీరథ నల్లా కనెక్షన్ల సర్వే సాగుతోంది.

సేకరిస్తున్న వివరాలు..

మిషన్ భగీరథ కోసం రూపొందించిన ప్రత్యేక యాప్‌లో ఫోన్ ద్వారా వివరాలు నమోదు చేస్తున్నారు. జిల్లా, మండలం, ఆవాసం, కుటుంబ యజమాని పేరుతో సహ నమోదు ఉంటాయి. నల్లా ఉందా, రోజుకు మనిషికి వంద లీటర్ల చొప్పున నీళ్లు వస్తున్నాయా, ఎన్ని రోజులకు ఒకసారి ఇస్తున్నారు, ఎన్ని రోజులకోసారి ఇస్తున్నారు, అనే వివరాలను నమోదు చేసుకుంటున్నారు. ఇంటి ఎదుట సదరు వ్యక్తిని నిలబెట్టి వివరాలు చెప్పిన వారితో పాటు నల్లా ఫోటో, ఫోన్ నెంబర్‌ను సైతం అప్‌లోడ్ చేస్తున్నారు. యాప్‌లో కుటుంబం పేరు నమోదై లేనట్లయితే కొత్తగా నమోదు చేసి కూడా వివరాలు సేకరిస్తున్నారు.

మండలంలో ఇలా...

వర్ధన్నపేట మండలంలో 18 గ్రామాలు ఉన్నాయి. ఈ గ్రామాల్లో మొత్తం 10,718 ఇండ్లు ఉండగా, అందులో 10,064 ఇండ్లను సర్వే చేశారు. ఇంకా 654 ఇండ్లు సర్వే చేయాల్సి ఉంది. ఇప్పటి వరకు 93.9 శాతం సర్వే పూర్తయినట్లు అధికారులు తెలిపారు. కొత్తగా సర్వేలో పేరు నమోదు చేయించుకున్న వారు 4,590 ఇండ్లు ఉన్నట్లు ప్రకటించారు. మండలంలోని దాదాపు 10 గ్రామాల్లో వంద శాతం సర్వే పూర్తి కాగా, జిల్లా అధికారుల ఆదేశాల మేరకు పూర్తయిన వివరాలను ఎప్పటికప్పుడు పంపిస్తున్నారు. జిల్లా పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ సర్వేకు మిషన్ భగీరథ అధికారులను పూర్తిగా దూరంగా ఉంచారు. మండల స్థాయిలో ఎంపీడీవో, ఎంపీవో, ఏపీవోలు, టెక్నికల్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు, ఐకేపీ సీసీలు సర్వే పాల్గొంటున్నారు.



కట్ర్యాలలో మిషన్ భగీరథ నల్లా కనెక్షన్ల సర్వే చేస్తున్న ఎంపీవో ధనలక్ష్మి తదితరులు

94 శాతం పూర్తి చేశాం..

వెంకటరమణ, ఎంపీడీవో, వర్ధన్నపేట



మండల వ్యాప్తంగా ఉన్న 18 గ్రామాల్లో సర్వేను 94 శాతం వరకు పూర్తి చేశాం. జిల్లా ఉన్నతాధికారులతో ఆదేశాలతో ఎప్పటికప్పుడు సర్వే వివరాలు ఆన్‌లైన్ చేసి రిపోర్టును పంపిస్తున్నాం. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం వెబ్‌సైట్‌లో పొందుపరిచి ప్రజల నుంచి వివరాల సేకరించాం. వంద శాతం పూర్తి చేసి నివేదికలు అందిస్తాం.

ఆర్టీసీ ఇన్‌చార్జ్ అకౌంట్స్‌ఆఫీసర్‌గా వెంకటేశ్వర్లు

బాలసముద్రం, జూన్ 29 : అవినీతి ఆరోపణలపై ఆర్టీసీ వరంగల్ రీజియన్‌లో అకౌంట్స్ ఆఫీసర్‌గా పనిచేసిన ఆర్.లావణ్యను బస్సు భవన్‌కు సరెండర్ చేసి ఆమెస్థానంలో కరీంనగర్ ఏవో వెంకటేశ్వర్లను ఇన్‌చార్జిగా నియమించినట్లు తెలిసింది. కాగా, అకౌంట్ ఆఫీసర్‌గా గతంలో అనేక అద్దె బస్సుల ఓనర్లు నుంచి ముడుపులు తీసుకున్నట్లు ఆరోపణలు రావడంతో ఆమెను ఆర్టీసీ ఎం.డి. సజ్జనార్ ఆర్టీసీ భవన్‌కు సరెండర్ చేశారు.

జూలై 1 నుంచి పలు రైళ్లు రద్దు

కాజీపేట, జూన్ 29 : మూడో లైన్ నిర్మాణం, రైల్వే ట్రాక్‌ల మరమ్మతు దృష్ట్యా జూలై 1 నుంచి 31 వరకు పలు రైళ్లు రద్దు చేస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. రద్దయిన రైళ్ల వివరాలు ఇలా ఉన్నాయి.. (07462) సికింద్రాబాద్ నుంచి వరంగల్ వెళ్లు పుష్‌పుల్ అప్‌అండ్ డౌన్, (17035) కాజీపేట నుంచి బల్లార్షా వెళ్లే కాగజ్‌నగర్ ఎక్స్‌ప్రెస్, (17033) కాజీపేట నుంచి సిర్పూర్‌కాగజ్ వెళ్లు రామగిరి ప్యాసింజర్ అప్ అండ్ డౌన్, (17034) భద్రాచలం నుంచి బల్లార్షా వెళ్లు సింగరేణి అప్ అండ్ డౌన్ ప్యాసింజర్ రైళ్లు ఉన్నాయి. ఆగస్టు 1 తర్వాత ఈ రైళ్లు యథావిధిగా నడుస్తాయని రైల్వే అధికారులు తెలిపారు.

దూరవిద్య డిగ్రీ పరీక్షల్లో 12 మంది డీబార్

కేయూ క్యాంపస్, జూన్ 29 : కాకతీయ యూనివర్సిటీ పరిధిలో నిర్వహిస్తున్న బీఏ, బీకాం, బీఎస్సీ ఇతర దూరవిద్య డిగ్రీ కోర్సుల పరీక్షల్లో చూచిరాతలకు పాల్పడగా పరీక్షల తనిఖీ అధికారులు పట్టుకుని 12 మంది విద్యార్థులను డీబార్ చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎస్.నరేందర్ శనివారం తెలిపారు. డీబారైన వారిలో మంచిర్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఒక్కరు, జనగామలో 6, వరంగల్ ఏఎస్ఎం కళాశాలలో 3, ఎల్‌బీ కళాశాలలో ఇద్దరు ఉన్నట్లు పేర్కొన్నారు. అలాగే పరీక్షల నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

'నిర్మాణాత్మక ప్రజా పోరాటాలు చేపట్టాలి'

గిర్మాజీపేట, జూన్ 29 : ప్రజా సమస్యల పరిష్కారానికి నిర్మాణాత్మక పోరాటాలు చేపట్టాలని ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి పార్టీ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. శనివారం వరంగల్ అండర్ బ్రిడ్జి సమీపంలోని ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యాలయంలో జిల్లా సహాయ కార్యదర్శి నర్రా ప్రతాప్ అధ్యక్షతన వరంగల్, హనుమకొండ జిల్లా కమిటీ సభ్యుల పార్టీ నిర్మాణ శిక్షణ తరగతులు జరిగాయి. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి రవి మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పార్టీ కమిటీలు పనిచేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన హామీలు అమలయ్యేంత వరకు నిరంతరం ప్రజా ఆందోళనలు చేపట్టాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో పార్టీ వరంగల్, హనుమకొండ జిల్లాల కార్యదర్శులు పెద్దారపు రమేష్, హంసారెడ్డి, ఉమ్మడి జిల్లా నాయకులు గోనె కుమారస్వామి, బాబురావు, కొమురయ్య, రవిందర్, రాజిరెడ్డి, రాగసుధ, మాస్ సావిత్రి, వెంకన్న, కుమార్, సదానందం, రాజు, జన్ను రమేష్, ప్రభాకర్, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన స్పోర్ట్స్ హాస్టల్ ఎంపికలు

వరంగల్ స్పోర్ట్స్, జూన్ 29 : స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ (సాట్) ఆదేశాల మేరకు రాష్ట్రంలోని వివిధ జిల్లా కేంద్రాల్లోని స్పోర్ట్ హాస్టల్‌లో విద్యార్థుల ప్రవేశాలకు నిర్వహిస్తున్న జిల్లాస్థాయి ఎంపిక పోటీలు శనివారం ముగిశాయి. వరంగల్ జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో మూడు రోజులుగా వరంగల్ ఓ సిటీ క్రీడా మైదానంలో స్పోర్ట్స్ హాస్టల్ లో 4వతరగతి లో ప్రవేశాలు పొందేందుకు పోటీలు నిర్వహించినట్లు వరంగల్ డీవైఎస్‌వో టీవీఎల్. సత్యవాణి స్పష్టం చేశారు. జిల్లా స్థాయిలో వివిధ మండలాల నుంచి నిర్వహించిన ఈ ఎంపిక పోటీలలో 14మంది బాలురు, 11 మంది బాలికలు పాల్గొన్నారన్నారు. ఇక్కడ జిల్లా స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులు జూలై నెల 9, 10వ తేదీలలో హకీంపేట స్పోర్ట్స్ స్కూల్ ఆవరణలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కోచ్‌లు వై.సుమన్, జె.లింగమూర్తి, ఎస్.కుమారస్వామి, ఇ.నాగరాజు, ఎస్, మహేష్, రవి కుమార్, మౌనిక, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.